

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 14 సంచిక : 11 జూలై 2009



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


| | |
|---|---|
| జిన్నూరు .............. | 25-05-09 |
| కంచుమర్రు .......... | 15-01-09 |
| విస్సాకోడేరు ......... | 22-03-09 |
| జిన్నూరు .............. | 18-03-09 |
| జిన్నూరు .............. | 25-06-09 |



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-05-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆచార్యులవారు బ్రహ్మసత్యం, జగత్‌మిధ్య అని చెప్పారు. సత్యం అనేది ఒకటిగా ఉంటుంది కాని రెండుగా ఉండదు. అదే మన హృదయంలో ఉంది. సత్యాన్నే మనం నారాయణా, నారాయణా అని పిలుస్తాము. నారాయణుడు అంటే ఒక వ్యక్తి కాదు. జీవకోటికి అంతటికి ఆధారంగా ఉన్న వస్తువే నారాయణుడు. మన హృదయంలో ఉన్నదే అంతటా వ్యాపించి ఉంది. సత్యం అన్నా, బ్రహ్మము అన్నా, ఈశ్వరుడు అన్నా ఒక్కటే, మన హృదయంలో ఉన్న సత్యం మనమాటలకు అందదు, మన మనస్సుకు అందదు, మన తలంపులకు అందదు కాబట్టి అది లేదు అనుకుంటాము. లేదు అని ఎందుకు అనుకుంటాము అంటే మనకి సజ్జన సహవాసం లేదు, శాస్త్రపరిచయం లేదు, దైవసేవ లేదు, గురువు సేవలేదు, సామాజిక దృక్పథము లేదు, పూర్వజన్మలో పుణ్యకర్మ చెయ్యలేదు అందుచేత సత్యం తాలుక స్పృహ మనకు రాదు, ఎంతసేపు మనకు ప్రాపంచిక స్పృహ ఉంటుంది. దీనికి ఏసుక్రీస్తు బైబిలులో ఏమని చెప్పాడంటే పిచ్చివాడా నీ కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచాన్ని అంతా నువ్వు కష్టపడి, కష్టపడి సంపాదించుకొంటావు అనుకో, చివరకు ఆత్మజ్ఞానం సంపాదించకుండా చనిపోతావు అనుకో నీకు వచ్చిన లాభం ఏమిటి? చివరకు సున్న మిగులుతుంది అని చెప్పాడు. వారు సత్యాన్ని దర్శించి చెప్పిన మాటలు అవి.

కోరిక, కోపము, భయము, ద్వేషము ఇటువంటి బలహీనతలు మనలో ఉన్నంతకాలం మనలను రంపము పెట్టి కోసేసినా మనకి సత్యానుభవం కలుగదు, ఆత్మజ్ఞానం రాదు. మనకి కామక్రోధాలు ఉ

న్నంతకాలం ఈ ప్రపంచం నిజంక్రిందే కనిపిస్తుంది. మన కామక్రోధాలు నిజంకానిది నిజంవలె కనిపింపచేస్తాయి. మరణం అంటే శరీరం మరణించటంకాదు. శరీరం ఉండగా శరీరంలేని స్థితి రావాలి. మనస్సు ఉండగా అమనస్క స్థితి రావాలి. మనం జీవితంలో అది కష్టపడి సంపాదిస్తే లోపలఉన్న వస్తువు నువ్వు తెలుసుకోవటం కాదు, తనంతటతానుగా నీకు ఎరుకలోనికి వస్తుంది. ఈ దేహము నేను, ఈ మనస్సు నేను అని ఈ రెండింటితోటి నీకు తాదాత్మ్యం ఉన్నంతకాలం నువ్వు శాస్త్రాలు చదివినా నీకు జ్ఞానం ఉదయించదు. మనం కానిదేదో కానట్టు తెలుసుకొంటే ఉన్నదేదో తనంతట తానుగా మనకి వ్యక్తమవుతుంది. మనం కామక్రోధాలు తగ్గించుకోవటం, దేహాభిమానం తగ్గించుకోవటం అంటే అది మనస్సుతోటి తాదాత్మ్యం పొందినంత తేలిక కాదు. కబీరు ఏమన్నాడంటే మీకు దేహాభిమానం తగ్గాలంటే ఎవరైతే నిన్ను ఎక్కువగా తిడుతున్నారో వాళ్ళ ఇంటికి దగ్గరలో ఏదైనా ఇల్లు దొరికితే తీసుకొని అందులో ఉండమన్నాడు కబీరు. అప్పుడు వాళ్ళ తిట్లు నీకు వినబడుతూ ఉంటాయి. నువ్వు దూరంగా ఉంటే ఆ తిట్లు నీకు వినబడవుకదా! ఆ తిట్లు నువ్వు వినగా, వినగా, ఆ తిట్లు వినటంవలన నీకు లాభం ఏమిటి అంటే దేనినైతే నువ్వు శ్రమపడి పోగొట్టుకోలేకపోతున్నావో అది ఆ తిట్లు వినటం వలన పోతుంది. అలాగ చెయ్యమని కబీరు చెప్పాడు. కబీరు మహాభక్తుడు, రామభక్తుడు. కబీరు రామనామం చేసి తరించాడు. మీరు చేసే జపాలకంటే, మీరు చేసే ధ్యానాల కంటే మీరు చేసే పూజలకంటే ఇవన్నీ మంచివే కాని వీటి అన్నింటికంటే గురువుపట్ల, ఈశ్వరుడిపట్ల విశ్వాసం పోషించుకోవటం అత్యంత ముఖ్యము. మీరు చేసే సాధన వలన మీకు నూటికి పది మార్కులే వస్తాయి. మీరు గురువుపట్ల, ఈశ్వరుడిపట్ల సర్వకాల సర్వావస్థలలో విశ్వాసం పోషించుకుంటే నూటికి తొంభై మార్కులు వస్తాయి. అంటే విశ్వాసానికి మించిన ధనం లేదు. మీ శ్వాస పోయినా విశ్వాసం పోగొట్టుకోవద్దని కబీరు చెప్పాడు. ఎంత గొప్ప పండితులైనా, ఎంత గొప్ప ధనవంతులైనా విశ్వాసం లేకుండా ఏసుక్రీస్తు కూడా తిరిగితే మీరు విశ్వాసహీనులు అని మొఖం మీద అనేవాడు. అయితే పరమేశ్వరుడు మీద విశ్వాసం కలగటం మనం అనుకున్నంత తేలికకాదు.

తులసీదాసు పుట్టినప్పుడు మూడు సంవత్సరాలు పిల్లవాడు ఎలాగ ఉంటాడో అలాగ ఉన్నాడు. పుట్టగానే ఏడవలేదు రామ్‌బోలో, రామ్‌బోలో అన్నాడు. ఆ బాలుడును చూసి తండ్రికి భయమేసింది. జ్యోతిష్కులను తీసుకువచ్చారు. జ్యోతిష్కులు ఆ బాలుడను చూచి వీడు పుట్టిన నక్షత్రం కుటుంబానికి అరిష్టం అని చెప్పారు. వీడు మన ఇంటి దగ్గర ఉంటే మనం నష్టపోతాము అనుకుంటున్నాడు తండ్రి. బిడ్డ పుట్టిన పదవరోజున తల్లి చనిపోయింది.

తులసీదాసుని 5 సం॥లు పెంచిన తరువాత పెంచిన తల్లి చనిపోయింది. అప్పడు తులసీదాసుని చూసేవాళ్ళు ఎవరూ లేరు. ఊళ్ళోకి బిక్షకి వెళ్ళేవాడు, వీడికి అన్నము పెడితే మనం చనిపోతాము అని అందరూ తలుపులు వేసేసుకొనేవారు. ఆ ఊళ్ళో ఎవరూ బిక్ష పెట్టేవారు కాదు. ఇలా తిరుగుతూ ఉంటే ఒక మహాత్ముడు అక్కడకు వచ్చాడు. ఏమిటి అబ్బాయి అని అడిగితే నాకు ఎవరూ అన్నము పెట్టటంలేదు నన్ను ఎవరూ చంపనక్కర్లేదు తిండిలేక చనిపోయేలాగ ఉన్నాను అన్నాడు. నువ్వు అలాగ అనవద్దు నీ నేత్రాలు దివ్యనేత్రాలు. నువ్వు పూర్వజన్మలో రాముడిని ఉపాసించావు అని తులసీదాసుని అలహాబాదు తీసుకుపోయాడు. అక్కడ కొన్నాళ్ళు పెంచి కాశీ తీసుకువెళ్ళి పండితులు దగ్గర కూర్చోబెట్టి చదువు చెప్పించాడు. తులసీదాసు 15వ సం॥ వచ్చేటప్పటికి మహాపండితుడు అయ్యాడు. ఆయన రామనామం విడిచిపెట్టలేదు. శాస్త్రాలన్నీ నేర్చుకున్నాడు. అక్కడ నుంచి రామాయణం చెప్పటం మొదలు పెట్టాడు. రామాయణం అంటే మహాసముద్రం. సముద్రంలో ఎన్ని రత్నాలు దొరుకుతాయో ఒక్క రామాయణంలో అన్ని రత్నాలు దొరుకుతాయి అని తులసీదాసు అనేవాడు. ఆయన ఆధ్యాత్మికంగా సాధన చేసుకొనేవాడు. తులసీదాసుకి 16వ సం॥ వస్తుంది. అప్పడు ఒక దీనబంధువు వస్తాడు. నువ్వు రామాయణం బాగా చెప్తున్నావు. నీకు పెళ్ళికాలేదని తెలిసింది. మా అమ్మాయి పేరు రత్నావళి చాలా అందంగా ఉంటుంది నీకు ఇచ్చి పెళ్ళిచేస్తాను అంటాడు ఆ దీనబంధువు. నేను సాధన చేసుకుంటున్నాను నాకు పెళ్ళి చేసుకొనే ఉద్దేశ్యం లేదు అన్నాడు. ఆ దీనబంధువు తులసీదాసుని బ్రతిమాలి పెళ్ళి చేసేసాడు. కాని మాయ ఎక్కడ ఉంది అంటే పెళ్ళి అయిన వెంటనే తులసీదాసు రాముడుని మర్చిపోయాడు. తులసీదాసుకి కొడుకు పుడతాడు. ఆ కొడుకు మీద ప్రేమలేదు. ఎంతసేపు భార్యమీద ప్రేమే. జన్మాంతరంలో ఏదో ప్రారబ్దం ఉంది. అది అలా తీసేయాలని భగవంతుడు నిర్ణయించుకున్నాడు. ఒకసారి తులసీదాసు ఊరు వెళ్ళినప్పడు భార్య పుట్టింటికి వెళ్ళింది. తులసీదాసు తిరిగి ఇంటికి వేచ్చేటప్పటికి భార్య రత్నావళి లేదు. ఇంక రామనామం లేదు రత్నావళి, రత్నావళి అంటున్నాడు. ఒకతను వచ్చి నీ భార్య పుట్టింటికి వెళ్ళింది అని చెప్పాడు. తులసీదాసు అత్తవారింటికి వెళ్ళిపోయాడు. అప్పడు భార్య ఏమంది అంటే నేను మా అమ్మగారిని, నాన్నగారిని చూడటానికి వచ్చాను. నువ్వు ఇంత తొందరగా రావలసిన పనిలేదు. నీకు నా శరీరం మీద ఉన్న వ్యామోహం, నీకు నా శరీరం మీద ఉన్న ఇష్టం రాముడు మీద ఉంటే ఈపాటికి నువ్వు తరించేవాడవు అని భార్య అంటే ఆయన హృదయంలోంచి రామభక్తి మళ్ళీపొంగి వచ్చేసింది. వెంటనే కాశీ వచ్చేసాడు. భార్యను మర్చిపోయాడు. మళ్ళీ

రామాయణం చెప్పకుంటూ ఉంటే, రాముడు తులసీదాసుచేత రామాయణం వ్రాయించాలి అనుకొన్నాడు. వాల్మీకి సంస్కృతంలో రామాయణం వ్రాసాడు. తులసీదాసు కూడా సంస్కృతంలో వ్రాద్దామని మొదలుపెట్టాడు. ఈ రోజు నాలుగు శ్లోకాలు వ్రాస్తే రేపు కనబడేవి కావు. సంస్కృతంలో వాల్మీకి వ్రాసాడు కదా. కాశీలో అందరూ హిందీ మాట్లాడుకుంటారు ఆ భాషలో వ్రాయమని ప్రేరణ వచ్చింది. 7 నెలలు 26 రోజులలో హిందీలో రామాయణం వ్రాసాడు. దానిని రామచరితమానస్ అంటారు. ప్రపంచంలో ఎన్నో గ్రంధాలు చదివాను కాని తులసీదాసు వ్రాసిన రామచరితమానస్ అంత అందమైన గ్రంథం నేను చదవలేదు, అంత సౌందర్యం నేను ఏ గ్రంథంలోను చూడలేదు అని మహాత్మాగాంధీ తన జీవితచరిత్రలో వ్రాసుకున్నాడు. దీనినిబట్టి తులసీదాసు యొక్క ఔన్నత్యం మీకు తెలుస్తుంది. రమణ మహర్షిగారికి మరణానుభవం ద్వారా జ్ఞానం వచ్చింది. భార్యమాటల వల్ల తులసీదాసు గారికి జ్ఞానం వచ్చేసింది.

కర్మబంధం ఎలా వస్తుంది అంటే నువ్వు పని చేస్తావు పని చేసేటప్పుడు నేను పని చేస్తున్నాను, నేను పని చేస్తున్నాను అని అనుకునేవాడు ఉన్నంతకాలం కర్మబంధం వచ్చేస్తుంది. నేను పని చేస్తున్నాను అని అనుకునేవాడు లేకపోతే నువ్వు పని చేసినా చెయ్యనివాడితో సమానం. వ్యక్తిభావన లేకుండా నువ్వు పని చేస్తే పని చేసినా చెయ్యనివాడితో సమానం అపుడు నీకు ఈశ్వరుడి దయకలుగుతుంది. అప్పుడు దేహగతమైన నేను పోయి ఆత్మనేను వస్తుంది. కొంతమంది చాలా మంచిపనులు చేస్తారు, మంచిపనులు చేసి ఈ నేనును అలంకరించుకుంటారు. ఇది కొంపముంచుతుందని వాడికి తెలియదు. ఆ మంచిపని వలన పుణ్యం రావచ్చును. ఆ పుణ్యం మళ్లీ ఆ దొంగనేనే అనుభవిస్తుంది. సంసారం అంటే ఇదే. ఇలా ఉన్నంతకాలం సంసారబంధం నిన్ను విడిచిపెట్టదు. మనందరం ఇప్పుడు కర్మబంధంలో ఉన్నాము. కర్మబంధంలో ఉన్న మనిషికి సంసారం వచ్చితీరుతుంది. కర్మబంధంపోతే ఇంక సంసారబంధం ఉండదు. ఆ కర్మబంధం ఎలా పోగొట్టుకోవాలి? మనం ఇష్టాఅయిష్టాలను బట్టికాకుండా శాస్త్రంలో ఏ కర్మ అయితే చెయ్యమన్నాడో అలా శాస్త్రంలో చెప్పిన ప్రకారము కర్మ చేసుకొంటూ వెడితే అంతకుముందు ఉన్న చెడ్డకర్మకు ఇది మందులాంటిది, ఇది చెడ్డకర్మను గెంటివేస్తుంది, అవిద్యలోంచి, బంధంలోంచి నిన్ను విడుదల చేస్తుంది. నీ ఇంద్రియాలకు, నీ మనస్సుకు ఇష్టమైన పని నువ్వు చేస్తూ ఉంటే కర్మ బంధిస్తుంది. కర్మబంధంలోంచి సంసారబంధం వచ్చేస్తుంది. ఇంక నీకు మోక్షం ఏమిటి? ఈ లోకానికి సంబంధించిన కోరికగాని, పరలోకానికి సంబంధించిన కోరికగాని

ఏమీ లేకుండా ఉండగలిగితే అప్పుడు నీకు వచ్చే సుఖం, నీకు వచ్చే శాంతి, ఆనందం ప్రపంచాన్ని పరిపాలించే చక్రవర్తికి కూడా ఉండదు అన్నాడు భగవాన్. సత్పురుషులతోటి సాంగత్యం చెయ్యటం వలన, పెద్దలకు సేవ చెయ్యటం వలన, శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యటం వలన, తిండిలో జాగ్రత్తగా ఉండటం వలన సత్వగుణం పెరుగుతుంది. సత్వగుణం కూడా గుణమేకాని సత్వగుణం ఆత్మజ్ఞానాన్ని పట్టి ఇస్తుంది. ఆత్మజ్ఞానం వలన వచ్చే సుఖం, వచ్చే శాంతి, వచ్చే ఆనందం ప్రపంచంలో ఏ పని చేసినా మీకు రాదు. మనం ఎటువంటి వాళ్ళతో స్నేహం చెయ్యాలంటే, నీళ్ళు ఏవిధంగా అయితే మన శరీరాన్ని శుభ్రం చేస్తాయో అలాగే మన మనస్సును ఎవరైతే శుభ్రం చేస్తారో వాళ్ళతోటే మనం స్నేహాలు చెయ్యాలి. అటువంటి గ్రంధాలు చదవాలి. వాక్కుతపస్సు అంటే మనం ఎప్పడూ పరుషవాక్యాలు మాట్లాడకూడదు. మానసిక తపస్సు అంటే మనస్సులో ఎప్పడూ మంచి తలంపులు వచ్చేలా చూడాలి. మనకి భగవదనుభవం కలగటానికి సహాయం చేసే తలంపులు వచ్చేలా చూసుకోవాలి ఇది మానసిక తపస్సు. శారీరక తపస్సు అంటే మనకి చేతనైతే మంచిపనులు చేయాలి, చెడ్డపనులు జోలికి వెళ్ళకూడదు. ఇతరులు మనల్ని చెడ్డపనులు చెయ్యమని ఉద్రేకపరచినా మనం ఉద్రేకపడకూడదు. మనం కంగారుపడి ఎవరిమీదో కక్షలు తీర్చుకోవటంకోసం చెడ్డపనులు చేస్తాము అనుకోండి దానివల్ల మనలోపల ఉన్న జీవుడు పాడైపోతాడు. ఆ జీవుడిని శుభ్రంగా శుచిగా ఉంచాలి. మన చైతన్యస్థాయి పెరగాలంటే ఈ మూడు తపస్సులు విడిచిపెట్టకూడదు.

మన శరీరంలో రోగం ఉంటే ఆరోగం మనకు తెలిస్తే పోగొట్టుకోవచ్చు. అలాగే మనలో ఉన్న బలహీనతలు ఏమిటో మనకు తెలిస్తే వాటిని పోగొట్టుకొంటాము. తెలియనప్పడు వాటిని ఎలా పోగొట్టుకుంటాము. నిజంగా నీకు గురువు అనుగ్రహం ఉంటే నీ బలహీనతలను ఎత్తి చూపిస్తాడు, ఎత్తి చూపించటమేకాదు అవి ఎలా తొలగించుకోవాలో ఉపాయము నీకు తట్టేలా చేస్తాడు, పోగొట్టుకునే శక్తిని కూడా నీకు ప్రసాదిస్తాడు వాడే గురువు. గురువు అంటే పని లేకుండా మొద్దులా ఉంటాడు అనుకోకండి. గురువు అంతర్యామిగా ఉంటాడు. మనకు వచ్చే తలంపులు చూస్తాడు. మనం చేసే పనులు చూస్తాడు. మనకి ఎక్కువ జన్మలు ఇవ్వకూడదు అని గురువు అనుకున్నప్పడు ఎక్కువ అనుభవాలు ఒక్క జన్మలోనే తీసుకువచ్చి అన్నీ అనుభవింపచేసి మనల్ని కడిగిన ముత్యంలా చేసి ఆయన స్వరూపాన్ని మనకి ఇస్తాడు వాడు గురువు. ఈ ప్రపంచంలో చెడ్డవాళ్ళకే రోజులు సుఖంగా వెళ్ళిపోతున్నాయి. మంచివాళ్ళు ఎక్కువ కష్టాలు పడుతున్నారు అని

కొంతమంది అనుకుంటారు. భగవంతుడు ఎవరినైతే అనుగ్రహించాడో వాళ్ళకి వందజన్మలలో అనుభవించవలసిన కష్టాలు ఒక్క జన్మలో అనుభవింపజేసి తన స్వరూపాన్ని ఇస్తాడు వాడు ఈశ్వరుడు. మహ్మద్ ఏమన్నాడు అంటే మీ శరీరయాత్రకి, మీ కుటుంబ పోషణకి సరిపడ సంపాదించుకొని అల్లాని స్మరించుకొంటూ కాలక్షేపం చెయ్యండి. మీ ప్రారబ్ధాన్ని బట్టి మీకు డబ్బు ఎక్కువ వస్తే డబ్బుని చూచి దేవుడిని మర్చిపోకుండా, ఆ డబ్బులో కొంత ఆర్థికంగా వెనకబడినవాళ్ళకి ఉపయోగించండి అని మహ్మద్ చెప్పాడు.

మన అందరికి గర్వం ఉంది. ఆ గర్వం మీ కళ్ళకు కనబడటం లేదు కాబట్టి గర్వం లేదు అనుకుంటాము. కొంతమందికి శరీరం అందంగా ఉంటుంది మేము చాలా అందంగా ఉన్నామని గర్వం వస్తుంది అది రూపగర్వం. కొంతమంది బాగా చదువుకోవటం వలన వాళ్ళకి గర్వం వచ్చేస్తుంది అది విద్యాగర్వం. మేము చాలా మంచివాళ్ళమండి. మా కుటుంబం అంతా మంచివాళ్ళు అంటారు అది శీలగర్వం. శీలగర్వం ఉన్నవాళ్ళు తొందరగా పాడైపోతారు. మేము హిమాలయ పర్వతాలు వెళ్ళి తపస్సు చేసామండి. మేము తెల్లవారుఝాము 3 గం॥లకు లేచి 6 గం॥లు వరకు ధ్యానం చేస్తున్నామండి అంటారు ఇది తపోగర్వం. తపోగర్వం ఉన్నవాళ్ళు మనకంటె ముందు పాడైపోతారు. వాళ్ళ ముఖంలో వికాసం లేదు. శుద్ధమొద్దుల్లా కనబడతారు. మీ చేతిలోకి అధికారం వచ్చిందనుకోండి మీ మాట చెల్లుబాటు అవుతూ ఉంటుంది. నామాట అందరూ వింటున్నారని గర్వం వస్తుంది ఇది అధికార గర్వం. మనం మెత్తని దొంగలం. మన గర్వం లోపల దాచుకుని పైకి పెద్ద మనుషుల్లా కనబడతూ ఉంటాము. మనకి గర్వం నూటికి నూరుపాళ్ళు లేకపోతే మనకి అమృతానుభవం వచ్చేయాలి. మీకు గర్వం ఉందని ఏదోఒకరోజు గురువు మీకు తెలియపరుస్తాడు. అప్పటినుంచి ఆ గర్వాన్ని పోగొట్టుకోవటానికి మీరు సాధన మొదలుపెడతారు. ఈ గర్వం ఉన్నంతసేపు మీకు జ్ఞానం రాదు, సంసారం విడిచిపెట్టదు. గర్వాన్ని ఎలా తొలగించుకోవాలో ఉపాయం చెప్పేవాడు గురువు. శరీరం చనిపోవటానికి ఒక రోగం చాలు అలాగే ఏ కారణం వల్ల మీకు గర్వం వచ్చినా పాడైపోతారు.

తులసీదాసు అంటాడు మీకే ప్రేమలేనపుడు ఇతరులను ఏమి ప్రేమిస్తారు, మీకే శాంతి లేనప్పడు ఎవరికి శాంతిని ఇస్తారు. మనం కామిస్తున్నాము కాని ఎవరిని ప్రేమించటంలేదు. ప్రేమించినట్లు నటిస్తున్నాము. విషయసుఖాలతోటి, మనుష్యులతోటి, లోకంతోటి సంబంధం లేనటువంటి శాంతి ఒకటి నీ హృదయంలో ఉంది, అది నీకు దొరికితే అప్పడు నువ్వు ఎవరినైనా ప్రేమించగలవు కాని అప్పటివరకు నువ్వు ఎవ్వరిని ప్రేమించలేవు అన్నాడు.

హృదయంలో ఉన్న శాంతిని పట్టుకోవటానికి ప్రయత్నం చెయ్యండి కాని ఎప్పడు వస్తుందా అని ఎదురు చూడకండి. మీరు ప్రయత్నం చేస్తూ అది ఎప్పడు వస్తుందా అని ఎదురు చూస్తూ ఉంటే మీకు సహనం లేదని అర్థం. నీరును పల్లానికి వెళ్ళమని నువ్వు చెప్పనక్కర్లేదు. దానంతట అదే వెళ్ళిపోతుంది. అలాగే జ్ఞానం సహనం ఉన్నవారి దగ్గరకి పరుగు పరుగున వెళ్ళిపోతుంది కాని సహనం లేనివారి దగ్గరకి మనం గెంటినా అది వెళ్ళదు. సహనం లేకుండా జ్ఞానం రాదు. సహనం, సహనం మరింత సహనం అంటాడు తులసీదాసు. హృదయంలో ఉన్న శాంతి మీకు దొరికాక ఇంక కోరికలు రావు. పంచభూతాలు లేకుండా ఎలా బతకలేమో అలా సమాజంతోటి సంబంధం లేకుండా మనం బతకలేము. ఎంతవరకు అవసరమో అంతవరకే మాట్లాడు. అవసరంలేని మాటలు మాట్లాడకు. నీకు బాగా డబ్బు ఉండవచ్చు, పది కారులు ఉండవచ్చు, పదిమంది బంధువులు ఉండవచ్చు కాని నీ సుఖం కోసం లోకంలో దేనిమీద ఆధారపడకు. నీ మనస్సు మీదగాని, నీ ఇంద్రియాలమీదగాని, నీ శరీరంమీద కాని ఆధారపడవద్దు. ఎన్ని అయినా మీకు ఉండనివ్వండి సుఖం కోసం బాహ్యవస్తువులు దేనిమీద ఆధారపడవద్దు. మీ మనస్సు అక్కడ వాలనివ్వకూడదు. ఎన్ని ఉన్నా ఇముడ్చుకోవాలి. నీ శరీరం చనిపోయినా నీ సుఖం కంటిన్యూ అయిపోవాలి, నీశాంతి కంటిన్యూ అయిపోవాలి. ఆత్మానందం మీకు అనుభవంలోనికి వస్తే ఈ లోకంలోకాని, పరలోకంలోకాని ఇట్టి ఆనందం, ఇట్టి సుఖంలేదని మీకు అనుభవంలో తెలుస్తూ ఉంటుంది.

జ్ఞానం సంపాదించాలనే జిజ్ఞాస మీ లోపల నుంచి వస్తూ ఉంటే మేము చెప్పేమాటలు మీకు ఉపయోగపడతాయి. ఆ జిజ్ఞాస మీలో లేనప్పడు మేము చెప్పేమాటలు మీరు విన్నా ప్రయోజనం లేదు. ఆ జిజ్ఞాస లేనపుడు ఆ మాటలు యొక్క విలువగాని, బరువుగాని మీరు పట్టుకోలేరు. నువ్వు ఏ పని చేసినా ఆ పని వలన నీ మనస్సులో ఉన్న దోషాలు తగ్గాలికాని పెరగకూడదు. మీ మనస్సులో ఉన్న దోషాలు పెరగటానికి కష్టపడి పని చెయ్యటం ఎందుకు? మళ్ళీ కర్మబంధం వస్తుంది. కర్మబంధం వస్తే సంసారబంధం వచ్చేస్తుంది. ఏ కారణాల వల్ల, ఏ కర్మవాసనలవల్ల మనకి ఈ శరీరం వచ్చిందో మన శరీరానికి మరణం వచ్చేలోపు ఆ కర్మవాసనలను తొలగించుకోవటమే మన సాధన యొక్క గమ్యం. మీరు ఎన్ని మంచిపనులు చేసినా మీరు చేసే పనుల వలన ఈశ్వరుడు పాదాలు దగ్గరకు చేరుకోలేరు. ఈశ్వరుడు మీద ఉన్న విశ్వాసం మిమ్మల్ని ఈశ్వరుడు పాదాల దగ్గరకు తీసుకువెడుతుంది. మనిషి బ్రతికున్నంతకాలం తన ప్రాణాన్ని ఎలా కాపాడుకుంటాడో అలా సాధకుడు ఈశ్వరుడు మీద విశ్వాసం కాపాడుకోవాలి. ఓ శివా నా అజ్ఞానాన్ని నీ కాళ్ళతోటి రాసేస్తున్నావు. నీ పాదాలు

కందిపోయాయా శివా! నాలో ఉన్న చెడ్డ పోగొట్టటానికి నీ పాదాలు కందిపోతున్నాయి ఎంత దయగలవాడవు నువ్వు, నేను నీకు ఏమి చేసాను అని నా మీద ఇంతదయ కురిపిస్తున్నావు శివా! దీపం వెలిగించాక చీకటి ఎక్కడ ఉంటుంది. నీ అనుగ్రహం వచ్చాక నా అజ్ఞానం ఎక్కడ ఉంటుంది శివా అని ఆచార్యులవారు అన్నారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-01-2009, కంచుమర్రు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏ మార్గంలో ప్రయాణం చేసినా ప్రతీ మనిషికీ వాడు ఆస్థికుడైనా, నాస్థికుడైనా వాడికి సుఖం కావాలి, ఆనందం కావాలి, శాంతి కావాలి. భగవంతుడు ఉన్నాడా, లేడా అనేది సమస్యకాదు, మనం ఉన్నామని అనుకుంటున్నాము కాని దాని తాలుక అనుభవం మనకు లేదు. ఆ ఉండటం అనేది మనకు అనుభవంలోనికి రావాలి. అది అనుభవంలోనికి రావాలంటే అది గారిడీలవల్ల, చమత్కారాలవల్ల, కుతంత్రాలవల్ల వచ్చేదికాదు. భగవంతుడిని మనం మోసం చేయలేము. మలం, విమలం. పరిశుద్ధంకానిది మలం. పరిశుద్ధమైనది విమలం. మన మనస్సులో మలదోషం ఉంటుంది. మనకి మలదోషం ఉంది కాబట్టే శరీరము ధరించి ఈ భూమి మీదకు వచ్చాము, లేకపోతే ఈ భూమి మీదకు రావలసిన పనిలేదు. మలదోషం నశిస్తేనేగాని మనకి విమలం రాదు. మనకు అందరిలాగ ఉండాలని ఉండదు. మనలో ఏదో విశేషం ఉందని అందరూ అనుకోవాలని అనుకుంటారు. మనిషికి అనారోగ్యం అక్కడ ప్రారంభమవుతుంది. మనం కృత్రిమ గౌరవాలకోసం బయటకు పరుగెడుతూఉంటే మన మనస్సులో మలం పెరుగుతుంది కాని ఇంక విమలం రాదు. అందుచేత మన పద్ధతిలో మనం ఉండాలి కాని ఎవరిని అనుకరించకూడదు.

వైరాగ్యం లేకుండా జ్ఞానం రాదు. సాధకుడికి వైరాగ్యమే సంపద. మనందరికీ బలహీనత ఎక్కడ ఉంది అంటే ఏదైనా కోరుకుంటే వస్తుంది, కోరుకోకపోతే రాదేమో అనుకుంటాము. అసలు మనం లేము ఈశ్వరుడు ఒక్కడే ఉన్నాడు. శాస్త్రం ఏమని చెప్పిందంటే మీరు ఎంత సాధన చేసినా, ఎన్ని గ్రంధాలు చదివినా, ఎన్ని ప్రాణాయామాలు చేసినా, ఎన్ని పూజలు చేసినా ఈశ్వరుడి అనుగ్రహం లేకుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు అని శాస్త్రం చెప్పింది. మన మనస్సును బాగుచేసుకోవాలని మనం అందరం అనుకుంటాము. జపం లేకుండా, ధ్యానం లేకుండా మనస్సును వదిలేస్తే ఎవడి సంస్కారాన్నిబట్టి, ఎవడి వాసనను బట్టి వాడి మనస్సు బజారులోనికి పరుగెత్తుకుపోతుంది. మనం జపాలుచేసి, ధ్యానాలుచేసి మనస్సును నియమించుకోవటానికి ప్రయత్నిస్తున్నాము. మనం ఎంతోకొంత ఈశ్వరుడిని పట్టుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము.

కానీ మనలను భగవంతుడు పట్టుకోవటం లేదు, వదిలేసాడు. పట్టుకునే సూచనలు కూడా లేవు. ఎందుచేతనంటే మనం బాహ్యమైన గొడవలతోటి, కీర్తికాంక్షతోటి, పాండిత్యంతోటి, ధనంతోటి, అధికారంతోటి తాదాత్మ్యం పొంది ఉంటున్నాము. వీరికి నేను అక్కరలేదు, నన్ను ఊరికే మాటకి ఉపయోగించుకుంటున్నారు అంతే. వారికి కావలసినవి వేరే ఉన్నాయి అని భగవంతుడు అనుకొంటున్నాడు, ఆయన మన కోరికలు నెరవేర్చవచ్చుకాని మనల్ని మటుకు ఆయన పట్టుకోడు. వ్యక్తీభావన ఉన్నంతకాలం భగవంతుడు మనల్ని పట్టుకోడు. మన మనస్సు యొక్క చాపల్యం ఆగుతూ ఉంటే భగవంతుడు మనలను పట్టుకుంటున్నాడని అర్థం. భగవంతుడు పట్టుకోవటం ప్రారంభిస్తే మనకి ఆత్మజ్ఞానం వచ్చేస్తుంది. భగవంతుడు మనల్ని పట్టుకోడు అనుకోండి మన సాధనల వల్ల, మన తెలివితేటలవల్ల ఎన్ని జన్మలు ఎత్తినా ఒడ్డుకి రాలేము. మనం నోటితోటి ఈశ్వరుడు ఉన్నాడని చెబుతున్నాము కాని హృదయంలో నమ్మటంలేదు. అది ఆయనకి తెలుసు. ఈశ్వరుడు ఉన్నాడని నోటితో కాలక్షేపానికి చెబుతున్నాముకాని ఈశ్వరుడిని తెలుసుకోవాలనే బుద్ధి, ఆ సంస్కారం, ఆ వాసన మనకు లేదు. మనకి వ్యవహారం ఎంతవరకు అవసరమో అంతవరకే కాని లోకవాసన ఎక్కువ పెట్టుకోకూడదు. లోకవాసన పెట్టుకుంటే ఆరోజుకారోజు దేవుడికి దూరం అయిపోతాము. నిర్వికారంగా ఉండటం నేర్చుకోవాలి. ఆయన అనుగ్రహం ఎప్పుడు వస్తుంది అంటే ఎవరైనా మిమ్మల్ని విమర్శించినప్పుడు కుంగిపోకుండా ఉంటే మిమ్మల్ని స్తోత్రం చేసినప్పుడు పొంగిపోకుండా ఉంటే మనస్సులో వికారం లేకుండా ఉండగలుగుతూ ఉంటే అప్పుడు ఆయన అనుగ్రహానికి పాత్రులు అవుతారు.

విత్తం, వృత్తం. విత్తం అంటే డబ్బు. వృత్తం అంటే శీలము అని అర్థం, ధర్మము అని అర్థం. వృత్తం లేకుండా విత్తంలోకి వెళ్ళకండి అని అంటే మీరు ధర్మంగా సంపాదించుకోండి. మీరు ధర్మవిరుద్ధంగా ఏదైనా సంపాదించుకుంటారు అనుకోండి మీ సంపాదన అంతా మీకు దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. ఇంక మీ మనస్సు మిమ్మల్ని సుఖపడనివ్వదు. ధనం అవసరం కాబట్టి మీరు ధర్మాన్ని విడిచిపెట్టకుండా సంపాదించుకోండి అది ధర్మవిరుద్ధంగా ఉంటే అది మీకు శాంతిని తీసుకునిరాదు అశాంతిని తీసుకొనివచ్చేస్తుంది. మనం ఏదైనా చెడ్డ చేస్తున్నాము అనుకోండి వెంటనే మనకు దుఃఖం రాదు వచ్చే జన్మలో అది మనం అనుభవించాలి. మనం మంచి చేస్తే వెంటనేదాని ఫలితం మనకి కనిపించకపోవచ్చు వచ్చే జన్మలో అది వస్తుంది. మేము ఎప్పుడు తరిస్తాము అని భగవాన్‌ని అడిగితే మీ కర్మవాసనలు పోయాక తరిస్తారు అనేవారు. కర్మవాసనలు నశిస్తేగాని మీ మనస్సు నశించదు. మనో నాశనం లేకుండా మీకు మోక్షం లేదు. పశ్చాత్తాపం అంటే ఏమిటంటే గంగానదిలో స్నానం

చేసి వచ్చి పాపాలు పోయినాయి అనుకోవటం, వెంకటేశ్వరస్వామి దగ్గరకి వెళ్ళిరావటం పశ్చాత్తాపంకాదు, నేను ఈ పొరపాటు చేసానని అంగీకరించటంకూడా పశ్చాత్తాపంకాదు. మీరు ఒక పొరపాటు చేసారు అనుకోండి అది పొరపాటు అని మీకు తెలిసినప్పుడు మళ్ళీ ఆ పొరపాటు జీవితంలో చెయ్యకుండా ఉండటం అది పశ్చాత్తాపం. మనిషి పొరపాటు చేయటంలో విశేషంలేదు. ఆ పొరపాటు సరిదిద్దుకోవటంలో విశేషం ఉంది. మనం నడిచేటప్పుడు ఒకోసారి కాలుజారుతుంది. కాలు జారిందని పడిపోయి అక్కడే కూర్చోము. కాలు వెనుకకు తీసుకుంటాము. అదే ప్రయత్నము. మీరు ఎలా ఉన్నారో అలా ఉన్నారు కాని మీరు అనుకున్నట్టు లేరు. మీరు ఎలా ఉన్నారో అది అనుభవం వచ్చేవరకూ ఏదో ఒకటి అనుకోవటం మానరు. మీరు ఆత్మ అయి ఉన్నారు. మీరు అదైనప్పటికీ దానికంటే వేరుగా ఉన్నాము అనే తలంపు ఎవరు తీసుకువస్తున్నారు? మనస్సు తీసుకువస్తోంది. ఈ ప్రపంచంలో అది గొప్పది, ఇది గొప్పది అని ఏదో అనుకుంటున్నాము కదా నిజంగా అవి గొప్పవికాదు. మనకి ఆరకమైన సంస్కారం ఉన్నప్పుడు ఊరికే అలా అనిపిస్తుంది. బయట ఏమీ లేదు. మనకి లోపల ఆ కోరిక ఉన్నప్పుడు అది గొప్పగా అనిపిస్తుంది. ఉన్నదంతా లోపలే ఉంది. మనం పోగొట్టుకోవలసింది కూడా లోపలే ఉంది.

మనస్సు విమలం అయ్యేవరకూ, మనస్సు పవిత్రం అయ్యేవరకూ అది ఎక్కడ నుంచి వస్తోందో అక్కడికి వెళ్ళిపడదు. అక్కడికి వెళ్ళి పడితేనేగాని దాని స్వరూపం తెలియదు. దాని స్వరూపం తెలిస్తే గాని మనస్సు వాండరింగ్ మానదు. జ్ఞానం అంటే ఏమిటి అని ఒకాయన రామకృష్ణ పరమహంసగారిని అడిగితే. ఇప్పుడు నువ్వు నేను, నేను అంటున్నావు కదా ఆ నేను నువ్వు కాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు. అది అనుభవంలోకి వచ్చేవరకూ నీకు జ్ఞానం రాదు అన్నారు. లోకంలో ఉన్న సంపద అంతా ఈశ్వరుడిదే. సంపదగలవాడే ఈశ్వరుడు ఆ సంపద మనది అనుకున్నా ఆయనదే. మనది కాదనుకున్నా ఆయనదే. ఈశ్వరసాక్షాత్కారం అయ్యేవరకూ ఏ జీవుడునీ నేను, నాది అనే తలంపులు విడిచిపెట్టవు. ఆయన దయనీకు కలిగేవరకూ నాది, నాది అనుకునేది కూడా ఈశ్వరుడిదే, అది నాది కాదు అన్న సంగతి నీకు తెలియదు. ఇదే మహామాయ. ఈ నేను అనే తలంపు నీ లోపల ఎక్కడనుంచి వస్తుందో చూచి దాని మూలాన్ని పట్టుకున్నా ఫరవాలేదు. లేకపోతే ఆ నేనుని ఈశ్వరుడికి ఇచ్చేసినా ఫరవాలేదు. నీకు తెలివితేటలు ఉంటే నువ్వు బాగుచేసుకో నువ్వు బాగుచేసుకోలేకపోతే ఈశ్వరుడికి ఇచ్చేసినా ఫరవాలేదు. అది ఎలాగోలాగ పోవాలి. విచారణామార్గంలో కాని, శరణాగతిమార్గంలోకాని ప్రయాణించేసి ఆ నేనుని పోగొట్టుకో.

ఫలితం దగ్గరకి వచ్చేటప్పటికి రెండూ ఒక్కటే.

నేను నాగపూర్ వెళ్లి తిరిగివచ్చేటప్పుడు స్టేషన్‌లో భక్తురాలు కరుణ ఏమంది అంటే నాన్నగారు మీరు మరల నాగపూర్ ఎప్పుడు వస్తారు అని ఎదురుచూస్తూ ఉంటాము అని చెప్పింది. కాని ఆవిడ పరలోకానికి వెళ్లిపోయింది. ఈశ్వరుడు జీవులను ఇలా ఎందుకు కలుపుతున్నాడో, ఎందుకు విడదీస్తున్నాడో, కొంతమందిని ఎందుకు కింద కూర్చోబెడుతున్నాడో, కొంతమందిని ఎందుకు అందలం ఎక్కిస్తున్నాడో తెలియదు. మాకు తెలుసును, మాకు తెలుసును అన్న వారికి కూడా తెలియదు, వాడికి ఏమీ తెలియదు కాబట్టి తెలుసును అంటాడు. మిమ్మల్ని చూడటానికి ఇంతమంది ఎందుకు వస్తున్నారు అని సోక్రటీసుని అడిగారు. మీరు అందరూ గడుసువాళ్ళు అనుకుంటున్నారు, మీరు అందరూ తెలివైనవాళ్ళు అనుకుంటున్నారు. నాకు ఏమీ తెలియదు. నాకు ఏమీ తెలియదు అన్న సంగతి నాకు తెలుసుకాబట్టి ఎక్కువ మంది నన్ను చూడటానికి వస్తున్నారు అన్నాడు. మీరు మేధావులని మీరు అనుకుంటూ ఉంటే మిమ్మల్ని చూడటానికి ఎవరు వస్తారు అని సోక్రటీసు అన్నాడు. మనం ఏ మార్గంలో ప్రయాణం చేసినా గమ్యం మర్చిపోకూడదు. మన మనస్సు పరమాత్మలో లయమవ్వాలి. మనస్సు పరమాత్మలో లయమవ్వాలంటే దానిని పవిత్రం చెయ్యాలి, విమలం చెయ్యాలి. బాహ్యమైన విషయాలగురించి మనస్సును పాడుచేసుకోకూడదు. చేసే స్నేహాల విషయంలో, చదివే గ్రంథాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. ఇవన్నీ ఉన్నప్పటికీ రోజూ ఒకగంట ఏకాంతవాసం చెయ్యాలి. మనం ఏకాంతంగా ఉన్నప్పుడు మన మనస్సులో ఏం జరుగుతోందో మనకి తెలుస్తూ ఉంటుంది. ప్లెస్‌పాయింట్స్ తెలుస్తాయి, మైనస్ పాయింట్స్ తెలుస్తాయి. అప్పుడు ఏ బలహీనత ఉందో దానిని జాగ్రత్తగా తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చెయ్యాలి. తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే మీ ప్రయత్నమే దేవుని అనుగ్రహంగా మారుతుంది.

మీరు ఒకటి గుర్తుపెట్టుకోండి. మీ రూపాన్ని, మీ పేరుని మర్చిపోతే మీ హృదయంలో ఉన్న ఆనందం పొంగి మీ సహస్రారాన్ని ముంచేస్తుంది. ఇంక మీరు ప్రాణాయామం చెయ్యనకరలేదు, గుడిలోనికి వెళ్లనక్కరలేదు. కాని మనం ఈ రూపబుద్ధి, నామబుద్ధి అనే గెడపదాటలేకపోతున్నాము. ఆ రెండూ కల్పితమే. ఈశ్వరుడు మనకి కాలగర్భంలో ఏమి పెట్టాడో తెలియదు. మంచి వస్తుందో, చెడ్డ వస్తుందో మనకి తెలియదు. మనో దేహములు ఎంత నిజమో బయట జరిగే గొడవలు కూడా అంతే నిజం. రూపంతోటి తాదాత్మ్యం, నామంతోటి తాదాత్మ్యం వదిలేయండి. అప్పుడు ప్రపంచం మిమ్మల్ని ఏమీ చేయలేదు, మీరు కర్మసిద్ధాంతానికి అతీతులు అయిపోతారు. మీకు రూపబుద్ధి, నామబుద్ధి పోదు అనుకోండి కట్రాడుకి కట్టేసిన

దూడని యజమాని ఎలాగ కొడతాడో అలాగే ఈశ్వరుడు కొరడాపుచ్చుకుని మిమ్మల్ని కొడతాడు. ఫలానా రూపంనాది, ఫలానా నామంనాది ఈ రెండు అనుకోవటం మానేసారు అనుకోండి నోటితోకాదు మీ అనుభవంలో వదిలేసారు అనుకోండి మీరు చేసుకున్న ప్రారబ్ధకర్మకూడా మిమ్మల్ని ఏమీ చెయ్యలేదు. ప్రారబ్ధానికి కూడా ఇంక మీరు దొరకరు. రామకృష్ణపరమహంసగారి దగ్గర లాటూ అని చదువులేనివాడు ఒకతను ఉండేవాడు. రామకృష్ణపరమహంస గారికి మంచినీళ్ళు ఇవ్వటం, గది శుభ్రం చేయటం చేసేవాడు, మరి నాకు చదువులేదుకదా ఈ పనులు చేస్తాను అనేవాడు. రామకృష్ణుడు శరీరం విడిచిపెట్టాక వివేకానందుడు అందరికీ సన్యాసం ఇస్తూ ఉంటే ఈ లాటూ అన్నాడు నాకు చదువులేదు నాకు సన్యాసం ఎందుకు అన్నాడు. చదువుకి సన్యాసానికి సంబంధంలేదు. సన్యాసం అంటే మనస్సుని వదిలేయటం అని స్వామీజీ అన్నారు. మేము అందరం ఎర్రబట్టలు కట్టుకొంటే నువ్వు ఒక్కడివే తెల్లబట్టలు కట్టుకోవటం ఎందుకు? నువ్వు నేనూ ఒక్కటే. నీకు చదువు ఉన్నా, చదువు లేకపోయినా నువ్వు నావాడివే. యూ ఆర్ మై లాటూ అయామ్ యువర్ స్వామీజీ. నేను నీ స్వామీజీని దీనికి చదువులతోటి సంబంధం ఏమిటి? అన్నాడు. జ్ఞానం అనేది, తపన అనేది, ముముక్షత్వం అనేది లోపల నుంచి రావాలి కాని పైనుంచి పోసేది కాదు.

నాకు ఒక బెంగపోతే ఇంకో బెంగ పట్టుకొంటోంది. ఏదో గొడవ వచ్చి నెత్తిమీద పడిపోతోంది నాకు ఏమిటో అర్థం కావటంలేదు అని ఒకరు అడిగితే నీకు భగవంతుడు మీద నమ్మకం లేకపోవటం వలన ఈ గొడవలు అన్నీ వస్తున్నాయి. భగవంతుడి మీద పూర్ణంగా విశ్వాసం ఉంచు. నీ భారం ఆయన మీద వెయ్యి ఏ బెంగా లేదు. నీ భారం ఆయన మీద వేస్తే ఆయన మోయలేడేమో అని నీకు భయం. ఆ భయం నీకు అక్కరలేదు నీ భారం మోస్తాడు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం ఎప్పుడూ పోషించుకో. ఆ విశ్వాసం నీకు ప్రవహిస్తున్న నదిలా ఉండాలి. అలా కనుక ఉంటే నీకు ఎన్ని బెంగలు ఉన్నా ఫరవాలేదు. ఎప్పుడు ఏ సమస్య ఎలా పరిష్కారం చెయ్యాలో అది ఆయన చూసుకుంటాడు. భగవంతుడు నీకంటే బుద్ధిమంతుడు, నీకంటే తెలివైనవాడు. ఆయనకి అతీంద్రియ జ్ఞానం ఉంది. నీకు ఏది మంచిదో నీకు ఏది చెడ్డో నీకంటే భగవంతుడికి బాగా తెలుసు. అందుచేత నీ బెంగలు అక్కడ పడేస్తే నువ్వు బెంగలేకుండా ఉండవచ్చు. నీకు కష్టము వచ్చినా, సుఖం వచ్చినా ఆయనకి తెలియకుండా రావటంలేదు. నిన్ను పవిత్రం చేయటానికి, నిన్ను ఆయనలో ఐక్యం చేసుకోవటానికి పంపించేవే ఈ కష్టాలన్నీ కూడా, అంతేగాని నిన్ను బాధపెట్టాలనికాదు. నీ మనస్సు వంకరలు తిరుగుతూ ఉంటే నీ వంకరలు తీసెయ్యటానికి కొన్ని కష్టాలు కావాలనే

పంపిస్తాడు. అవి కష్టాలు అని నువ్వు అనుకుంటున్నావు. అవి కష్టాలు కాదు భగవంతుడు అనుగ్రహం ఆ రూపంలో వస్తుంది. అది నువ్వు ప్రశ్నించకుండా అనుభవిస్తే నిన్ను ఆయనలో ఐక్యం చేసుకుంటాడు. ఆయన ఏదిగా ఉన్నాడో అదే నేను అని అప్పడు నీకు తెలుస్తుంది. నీ మనస్సు పలచబడాలి. మనస్సు పలచబడ్డాక దానంతటదే చిరిగిపోతుంది. అయితే ఈలోపు మనం గుర్తింపులు కోరుతున్నాము అనుకోండి మనస్సు చిక్కబడిపోతుంది. మనం గుర్తింపులు కోరకుండా పని పనికోసమే చేస్తున్నాము అనుకోండి మనస్సు నెమ్మదిగా పల్చబడిపోయి మీకు తెలియకుండా మనస్సు చిరిగిపోతుంది. అప్పడు పరమాత్మలో మీరు ఐక్యమవుతారు.

మనం శాంతిని కాపాడుకోవాలి. ఎదుటివారు ఎవరైనా మీపట్ల ఉండే ద్వేషం కొలదీ మీ శాంతిని చెడగొట్టటానికి ప్రయత్నం చేసినా మీరు శాంతిని కాపాడుకోవాలి. ఎవరైనా ఏదైనా మాట్లాడుతున్నారు అంటే ఎందుకు మాట్లాడుతున్నారో మీకు తెలుస్తూ ఉండాలి. ఆ వివేకం ఉండాలి ఆ వివేకం లేకపోతే, వైరాగ్యం లేకపోతే మనకి అంతర్దృష్టి కలుగదు. ప్రపంచంలో ఏ వస్తువు మీద నీ మనస్సు వాలకుండా ఉంటే అది వైరాగ్యం. వివేకం అంటే విడదీసుకోవటం. ఏది చేయదగినది, ఏది వదిలేయాలి అని. ఏది చెయ్యాలో, ఏది వదిలేయాలో నీ బుద్ధికి తట్టదు నీకు అంత మేధస్సులేదు. అందుకు శాస్త్రం ఏది చెప్పిందో అలా నిదానంగా వెళ్లిపో. శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకుని ప్రవర్తించు. అద్దంలో నీ ముఖం చూచి నిన్ను నువ్వు ఎలా సవరించుకుంటావో అలాగ శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని శాస్త్రానికి అనుగుణంగా నీ జీవితం ఉందో లేదో సరిచూసుకో అలా జీవిస్తూ ఉంటే ఇప్పడే నువ్వు మోక్షాన్ని పొందుతావు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-03-2009, విస్సాకోడేరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భక్తిలేకుండా మనం పరమాత్మని తెలుసుకోలేము. మనం రాముడునిగాని, కృష్ణుడునిగాని, ఏదోఒక అవతారపురుషుడినికాని ధ్యానం చేస్తూ ఉంటే పవిత్రత కలుగుతుంది, భక్తి వస్తుంది, అదీ గొప్పతనం. పరమేశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, మనందరి జీవితాల్ని నడిపేవాడు, మనకి యజమాని ఒకడు ఉన్నాడు అని భక్తి వలన మనకు గుర్తింపు వస్తుంది. మనం ఎవరి మటుకు వారు స్వతంత్రులం అయిపోయాము అనుకుంటున్నాము. అందుకే మనం భగవంతుడు చెప్పిన మాటలు వినటంలేదు. పుణ్యబలం లేకపోవటంవల్ల ఆయన మాటలు మనకు మనస్కరించటంలేదు. ఇది కలిదోషం. మనకి ఎంతోపుణ్యబలం ఉంటేగాని, పూర్వజన్మలో స్వార్థంలేని కర్మలు చేసిఉంటేగాని భగవంతుడి మాటమీద మనకి విశ్వాసం కలగదు. అన్ని జంతువులకంటే పెద్ద జంతువు గొప్ప జంతువు మనిషి. మిగతా

జంతువులకీ ఈ జంతువుకీ తేడా ఏమిటంటే ఈ జంతువుకి దేవుడి ఆలోచనకూడా పెట్టాడు. వీడికి ఉన్న ఆలోచనని సద్వినియోగం చేసుకొంటే ఈ జంతువుకి అప్పడు మానవత్వం వస్తుంది, మనిషి అవుతాడు. ఇప్పడు మనకి జంతుబుద్ధే ఉంది, దైవబుద్ధి లేదు. మన బుద్ధిని మార్చుకుంటే దైవబుద్ధి వస్తుంది అని లింకన్ అంటాడు. మనం అన్నము తింటున్నాము, అవి పచ్చగడ్డి తింటున్నాయి. మనమూ బతుకుతున్నాము, అవీ బతుకుతున్నాయి. మనం జీవితంలో ఏమీ నేర్చుకోకపోతే, సమాజానికి ఎంతోకొంత ఉపయోగపడకపోతే మనకీ జంతువుకీ భేదం లేదు. ఇప్పడు మన ప్రవర్తన బావుంది అనుకోండి మన ప్రవర్తన చూస్తే చాలామంది నేర్చుకుంటారు. ప్రవర్తన అనేది ఇచ్చేది. గౌరవం అనేది పుచ్చుకునేది, అంటే మనకి ఇతరులు ఇచ్చేది. అందుచేత కీర్తికంటే ప్రవర్తన మంచిది, కీర్తికంటే యోగ్యత మంచిది. నిజం ఒకలాగే ఉంటుంది. నిజంకానిది రకరకాలుగా ఉంటుంది, నిలకడగా ఉండదు. శరీరం నిజంకాదు, మనస్సు నిజంకాదు. శరీరం ఈవేళ ఆరోగ్యంగా ఉన్నా రేపు ఆరోగ్యం చెడిపోవచ్చు. ఈరోజు మనస్సు బాగా ఉన్నా రేపు చెడు ఆలోచనలు రావచ్చు. అందుచేత జాగ్రత్తగా ఈశరీరాన్ని, మనస్సుని భగవంతుడి సేవకు, సమాజ సేవకు ఉపయోగించుకోవాలి. సేవ ఎందుకు పెట్టారంటే 24 గంటలు పూజ చేయలేరు, 24 గంటలు ధ్యానం చేయలేరు, 24 గంటలు జపం చేయలేరు. మీ పనులేవో మీరు చూచుకొని మీ ఇంద్రియాలను ఖాళీగా ఉంచకుండా పదిమందికి ఉపయోగపడేలాగ చేస్తే మీరు పవిత్రులవుతారు. పరమపవిత్రుడుకి కాని లోపల ఉన్న చైతన్యం, లోపలఉన్న ఈశ్వరుడు అనుభవంలోనికి రాడు. లోపలఉన్న ఈశ్వరుడు ఎంత పవిత్రుడో, ఎంత నిర్మలుడో మన మనస్సు అంత నిర్మలంగా, అంత పవిత్రంగా ఉంటే నది వెళ్ళి సముద్రంలో కలిసినట్టు ఈ జీవుడు వెళ్ళి హృదయంలో కలిసిపోతాడు.

ఏకారణం వలన అయినా మీకు అశాంతి వస్తోంది అనుకోండి, దుఃఖము వస్తోంది అనుకోండి, మీకు ఎక్కడ నుంచి అశాంతి వస్తోందో, మీకు ఎక్కడనుంచి దుఃఖము వస్తోందో అక్కడ మీకు బంధము ఉంది. ఇది దృష్టిలో పెట్టుకోండి. మీకు ప్రపంచములో ఎక్కడా బంధము లేదు అనుకోండి మీకు దుఃఖం రమ్మన్నారాదు. మీకు అశాంతి రమ్మన్నారాదు. మన ఇంట్లో వాళ్ళకి ఏదైనా రోగం వచ్చింది అనుకోండి మీరు డ్యూటీ చెయ్యాలి అంతేగాని మీరు అశాంతికి గురి అవ్వకూడదు. మీరు బెంగపెట్టుకోకూడదు. డ్యూటీ చేసి వదిలేయటమే, నిర్ణయం ఈశ్వరుడికి వదిలిపెట్టేయాలి. అసలు బంధానికి మించిన పాపం లేదు. ఏ మనిషి అయినా పాపం చేస్తే బంధం వలనే చేస్తాడు. వాడికి అసలు బంధమే లేదు అనుకోండి, వాడికి పాపము చెయ్యాలనే తలంపుకూడా రాదు. ఎటాచ్‌మెంట్ లేకపోతే ఏమీ లేదు.

మీకు ఎక్కడైనా చెడ్డవాసన వస్తోంది అనుకోండి అక్కడ ఆ వాసన భరించలేక కూర్చోరు లేచివెళ్ళిపోతారు. బయట వస్తున్న చెడ్డవాసన గురించి మీరు అంత కంగారుపడిపోతున్నారు కదా మరి లోపల దుర్గంధం ఉన్న మనుషుల దగ్గర ఎలా కూర్చుంటున్నారు అని గౌతమబుద్ధుడు అడిగాడు. ఎక్కువ రాగద్వేషాలు పెట్టుకొని మానసిక క్షోభతోటి కాలిపోయే మనుషులతో మీరు ఎలా స్నేహాలు చేస్తున్నారు. వాళ్ళ దగ్గర ఎలా కూర్చుంటున్నారు అన్నాడు. మీరు అలా అలవాటు పడిపోయారు అంటే మీకు అసలు సాధన లేదు.

నేను విడిచిపెడితే అహంకారం పోతుంది. నాది విడిచిపెడితే మమకారం పోతుంది. కొంతమంది అంటారు మనం పుట్టినప్పుడు ఏమీ తేలేదు. మనం చనిపోయినప్పుడు ఏమీ పట్టుకెళ్ళము అంటారు. ఆ మాటలు అబద్ధాలు ప్రతీవాడు పుట్టినప్పుడు కర్మ తెచ్చుకుంటాడు. భగవంతుడు జీవుడికి ఏ శరీరం కావాలో ఆ శరీరాన్ని వాడు నిర్ణయిస్తాడు. మన ఇష్టానుసారం జరగదు. మీ తల్లితండ్రులు మీకు శరీరాన్ని ఇస్తారు కాని కర్మ మటుకు వాడు చేసిందే వాడి కూడా వస్తుంది. భగవాన్ ఏమి చెప్పారు అంటే మీరు పది చెడ్డవాసనలతో పుట్టారు అనుకోండి ఆ పది చెడ్డవాసనలు ఇక్కడ పోగొట్టుకోలేకపోయినా కనీసం నాలుగు వాసనలు అయినా పోగొట్టుకొని పాపభారాన్ని తగ్గించుకొని ఈ శరీరాన్ని విడిచిపెట్టండి. ఈశ్వరుడిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ఏ మనస్సు అయితే మీకు అడ్డువస్తోందో ఆ మనస్సును ఒక ప్రక్కన పెట్టండి. అలా చేయకుండా దానిని మోసుకు తిరుగుతారేమిటి? దానిని మీరు మోసుకు తిరిగినంతకాలం నేను ఎంత చెప్పినా నా మాట మీ బుర్రకు ఎక్కదు అన్నాడు పరమాత్మ. మీ మనస్సును ఒక ప్రక్కన పెట్టి నేను చెప్పేది మీరు డైరెక్టుగా వింటే ఆ మాట మీ హృదయంలోకి వెళుతుంది. అంతేగాని నేనేదో పుణ్యం చేసుకొన్నాను, పాపం చేసుకొన్నాను అని మీ గొడవలు, మీ గౌరవాలు దృష్టిలోపెట్టుకుంటే నేను చెప్పేది మీ బుర్రకు ఎక్కదు. మీకు ఈశ్వరుడి పట్ల భక్తికలిగింది అనుకోండి, మీరు సాధన పేరుమీద పెద్దకష్టపడనక్కరలేదు. మీ మనస్సు నెమ్మదిగా పల్చబడిపోతుంది. ఆ మనస్సును భగవంతుడు తన హృదయంలోనికి తీసుకుంటాడు.

ఏమండీ మాకు కలలు వస్తున్నాయి కదా! మీకు కూడా కలలు వస్తాయా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. భగవాన్ అన్నారు మాకు కలవస్తోంది, మీకూ కలవస్తోంది కాని ఒక తేడా ఉంది అన్నారు. మాకు కలవస్తూ ఉంటే ఇదంతా కల అని తెలుస్తూ ఉంటుంది. మీకు కల జరిగేటప్పుడు అది కల అని తెలియదు, మీకు మెలకువ వచ్చేవరకూ అది నిజమే అనిపిస్తుంది. ఇప్పుడు మీతోటి మాట్లాడుతున్నా, కూర్చున్నా, అన్నంతింటున్నా ఇవన్నీ నిజమని, మీకు అనిపిస్తుంది

కాని మాకు ఇది కూడా కల అని తెలుస్తూ ఉంటుంది. అందుచేత మాకు మోహం కలుగదు. ఈ దేహం కూడా స్వప్నమే ఇదీ నిజంకాదని తెలుస్తూ ఉంటుంది. నిజంకానిదేదీ నిత్యముకాదు. ఇది నిత్యము కాదని మాకు తెలుస్తూ ఉంటుంది అందుచేత మోహం కలిగే అవకాశం లేదు. మనకి ఎందుకు మోహం కలుగుతుంది అంటే ఈ జాగ్రదావస్థలో జరిగేది కూడా స్వప్నమే అయినా మనం నిజం అనుకుంటున్నాము కాబట్టే మనకి మోహం కలుగుతుంది. మన హృదయంలో ఒక నిజం ఉంది. నీకు హృదయంలో మేలుకొలుపు వచ్చేవరకూ, ఏ మనస్సు అయితే ఇదంతా కల్పిస్తోందో ఆ మనస్సు హృదయంలోకి వెళ్ళి అక్కడ కరిగిపోయేవరకూ నువ్వు ఎన్నిసాధనలు చేసినా ఇది నిజంకాకపోయినా నీకు నిజంవలె కనిపిస్తూ ఉంటుంది. అందుచేత ఈ మాయలోంచి ఎవరూ బయటకు రాలేరని పరమాత్మ అన్నాడు. భగవంతుడు చెప్పినమాట అహంకారబుద్ధి ఉన్నవాడు ఎవడూ వినడు, వాడికి వినాలని అనిపించదు. ఆ మాటలు వాడికి చేదుగా ఉంటాయి. అహంకార బుద్ధిలేని వాడు ఆ మాటలు వింటాడు, బాగుపడతాడు. విననివాడు నశిస్తాడు. మీరు భగవంతుని మాటయందు గౌరవం కలిగి ఉండండి, విశ్వాసము కలిగి ఉండండి. విశ్వాసహీనులు అవ్వవద్దు.

మనం బాగుపడటానికి భగవంతుడు ఎంతో సాహిత్యం ఇచ్చాడు. ఎన్నో మంచిమాటలు చెప్పాడు. భగవంతుడిపట్ల మనకి కృతజ్ఞత లేకపోతే ఎలాగ? కొంతమంది మంచివాళ్ళు ఉంటారు. ఎదుటివాళ్ళ దగ్గర నుంచి కృతజ్ఞత కూడా ఆశించరు. కుడిచెయ్యి ఎడమచెయ్యికి ఉపకారం చేస్తే కృతజ్ఞత ఏమి ఆశిస్తుంది. కుడిచెయ్యీ ఈ శరీరానిదే, ఎడమచెయ్యీ ఈ శరీరానిదే. అంటే అంతా తానే. మీకు ఎవరైనా ఉపకారం చేస్తూ ఉంటే వారిలో అంతర్యామిగా ఉన్న వాడు ఈశ్వరుడే. మీకు ఎవరైనా అపకారం చేస్తూ ఉంటే వారిలో అంతర్యామిగా ఉన్న వాడు కూడా ఈశ్వరుడే. అంటే వీటిద్వారా భగవంతుడు మీకు ట్రైనింగు ఇస్తున్నాడు. మీరు కేవలం అన్నం తినటానికి, బట్టలు కట్టుకోవటానికి ఈ లోకంలోనికి రాలేదు. శిక్షణ పొందటానికి వచ్చారు. సమాజంలో రకరకాల మనుషులు ఉంటారు, ఎక్కడా మనం ఆకర్షణకి గురికాకుండా కేవలం దేవుని వాక్యాన్ని మనం ప్రమాణంగా పెట్టుకొని ఆయనలో ఐక్యం అవ్వటానికి ప్రయత్నం చేస్తూ ఆ చైతన్యసాగరంలో ఐక్యంకావాలి. మీరు ఎవరో ఒకరిగురించి బెంగపెట్టుకుంటారు అనుకోండి. ఎంతసేపువారి గురించే ఆలోచిస్తారు. ఈలోపు మీకు మరణం వచ్చేస్తుంది ఇంక మీకు సాధన ఏమిటి. అలాటైము పాడుచేసుకోవటానికి కారణం మోహం. మనం రాగద్వేషాలు తగ్గించుకోవాలి. మనంఒకరిమీద ఎక్కువ ఇష్టం పెంచేసుకొని, ఒకరిమీద అయిష్టం పెంచేసుకొంటే దాని వలన మనకాలం ఖర్చు అయిపోతుంది. మైండు పొల్యూట్

అయిపోతుంది. కాలాన్ని శక్తిని వృథాచేసుకోవద్దు. ఉన్నదేదో ఉంది. లేనిదేదో లేదు. ఉన్న దానిని లేదు అనుకున్నా అది పోదు. లేనిదానిని ఉంది అనుకున్నా మీరు అనుకోవటం వల్ల అది ఉండదు. ఇది నిశ్చయం అని పరమాత్మ చెప్పాడు. ఇది మీకు అర్థం అయినా అర్థంకాక పోయినా దీనిలోతు మీకు తెలియకపోయినా ఇది మీ బుర్రలో బాగా తిప్పకోండి. మన మాట, చేత, ఆలోచన వలన మనస్సు పెరగకుండా చూసుకోవాలి.

ప్రపంచాన్ని జయించటం అంటే, ప్రపంచంలో ఉన్న రాగద్వేషాలు కాని, ప్రాపంచిక గొడవలు కాని మీ మెదడులో పడగూడదు. అప్పుడు మీరు ప్రపంచాన్ని జయించినట్లు. ప్రపంచాన్ని జయించటం అంటే భూమిని ఆక్రమించు కోవటంకాదు. లోకం అంటే ట్రైనింగు ప్లేసు. మనం ట్రైనింగు కోసం వచ్చాము. మీరు ఏమి చెయ్యాలి అంటే మనం జీవితంలోంచి ఏం పాఠాలు నేర్చుకున్నాము. మన ప్రవర్తన పూర్వం ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉంది, మన ప్రవర్తనని సరిదిద్దుకుంటున్నామా, లేదా? ఈశ్వరుని దయకోసం ఏమైనా పని చేస్తున్నామా, లేదా అని మనం చూసుకోవాలి. ఇంక మనకు లోకం గొడవ వద్దు. లోకం మనల్ని మెచ్చుకుంటోందా, లేదా అని అటు వెళ్ళవద్దు. అటువెడితే పాడైపోతాము. ఈరోజు మీకు దండలు వేసినవారే రేపు వచ్చి మీ ముఖానికి పేడరాయవచ్చు. లోకం అటువంటిది. లోకాన్ని వదిలేయండి. మీకు ఆధారం, నాకు ఆధారం, పంచభూతాలకి ఆధారం, ప్రపంచానికి ఆధారం అయిన పరమేశ్వరుడిని ఆశ్రయిస్తే సరిపోతుంది. వాడే పెరుమాళ్ళు. పెరుమాళ్ళు అంతటా ఉన్నాడు. అంతటా ఉన్నవాడిని మనం పట్టుకోలేము అంతటా ఉన్న పరమేశ్వరుడిని పూజించలేము కాబట్టి ఆయనకి ఒక రూపం పెట్టి, నామం కల్పించి ఆయనని పూజించుకుంటున్నాము. మీరు చెట్టుమొదలులో నీరుపోస్తే ఆనీరు కొమ్మలకి, రొబ్బలకి, ఆకులకి అందుతుంది. అలాగే మీరు గుడికి వెళ్ళి ఈశ్వరుడికి ఏదైనా పూజ చేస్తే ఆ పూజ అంతటా ఉన్న దేవుడికి కూడా అందుతుంది. నమ్మనివారికి అది విగ్రహం, నమ్మినవారికి అదే దేవుడు. నమ్మనివారిది దుమ్ము, నమ్మినవారిది సొమ్ము. అది విగ్రహమేకదా అనుకోకండి. ఆ విగ్రహం మనకి మనస్సు కంట్రోలు నేర్పుతుంది. ఇంద్రియాలకు నిగ్రహం నేర్పుతుంది. ఆ విగ్రహం మనకి మంచిబుద్ధిని నేర్పుతుంది.

ఒకసారి స్వామి వివేకానందుని మీరు విగ్రహారాధన ఒప్పకుంటారా అని అడిగారు. విగ్రహారాధన చేయుటంవల్ల ఒక మామూలు మానవుడు రామకృష్ణపరమహంస అయిపోయినప్పడు అటువంటి విగ్రహారాధన నేను అంగీకరిస్తాను అన్నాడు. విగ్రహాన్ని ఆరాధించి మా గురువులు ఎటువంటి స్థితిని పొందారో అలాగ విగ్రహాన్ని ఆరాధించి మీరు కూడా అటువంటి

స్థితిని పొందితే నాకు ఏమీ అభ్యంతరం లేదు అన్నాడు. మీరు పెరుమాళ్లని చూస్తూ ఉండండి, ఆ రూపం మీద మీరు మనస్సు పెట్టండి, ఆ నామాన్ని స్మరించుకోండి దేవుడియొక్క వైభవాన్ని మీరు జ్ఞాపకం పెట్టుకోండి. మీ చేతులతోటి దేవుడికి నమస్కారం పెట్టుకోండి, మీనోటి నిండా దేవుడి నామం స్మరించుకోండి. మీరు కూడా పరమహంసలు అయిపోతారు. మీరు చేసేది శ్రద్ధగా చెయ్యాలి, భక్తిగా చెయ్యాలి, తపనతో చెయ్యాలి, ఏకాగ్రతతో చెయ్యాలి, ఇతరులకోసం కాకుండా మనం ఉద్ధరింపబడాలని చెయ్యాలి. ఇందులో రహస్యం ఏమిటి అంటే మీరు వంద కుటీరాలు కట్టించడం కంటే, పదికోట్ల దానధర్మాలు చేయడంకంటే మీరు జ్ఞానం సంపాదిస్తే మీరు పవిత్రత సంపాదిస్తే మీరు యోగ్యత, అర్హత సంపాదిస్తే మిమ్మల్ని చూచి కొన్నికోట్లమంది బాగుపడతారు. కర్తలేని కర్మ ఎలా ఉంటుంది అంటే వారి ద్వారా వండర్‌ఫుల్ వర్క్ జరిగిపోతూ ఉంటుంది. కానీ మనిషి కనబడడు. కర్తలేని వాడే అటువంటి కర్మ చేయగలడు. నేను చేస్తున్నాను అనే తలంపు ఉన్నవాడు అంతపని చేయలేడు. మీరు తెరమీద కనబడకూడదు. పని జరిగిపోతూ ఉండాలి. అది కర్తలేని కర్మ. మన దగ్గర చెడ్డ ఎక్కడ ఉంది అంటే మనం లోకానికి దగ్గరగా ఉంటున్నాము. భగవంతుడికి దూరంగా ఉంటున్నాము. అలా అలవాటుపడిపోయాము. ఇప్పుడు మనం సాధన ఎలా చెయ్యాలి అంటే లోకానికి దూరం అవ్వాలి. భగవంతుడికి దగ్గర అవ్వాలి. ఇదే సాధన యొక్క గమ్యం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-03-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత అన్ని శాస్త్రాల సారం ఏమిటి అంటే శాంతిగా ఉండమని చెపుతున్నాయి. మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీరు శాంతిని పోగొట్టుకోవద్దు. ఇది విశాలమైన ప్రపంచం. దీనిని నడిపేవాడిని ఈశ్వరుడు అంటారు. భగవంతుడు మనుషులు పుట్టినప్పుడే ప్రారబ్దాన్ని రాసేసి ఈ భూమి మీదకు పంపుతాడు. నువ్వు ఎంత ప్రయత్నం చేసినా నీ ప్రారబ్దంలో ఉన్నది తప్పించుకోలేవు. దేహానికే ప్రారబ్దం. దేహంతోటి జరిగే కార్యక్రమాలు మీరు పట్టించుకోకూడదు. అప్పుడు ఇంక మీకు దుఃఖంరాదు. మీకు మంచి జరిగితే గర్వం వస్తుంది, చెడ్డ జరిగితే దుఃఖం వస్తుంది దేహానికి అనేక రకాల ప్రారబ్దాలు ఉంటాయి. జీవుడు ఆ ప్రారబ్దం ద్వారా పాఠాలు నేర్చుకోవాలి. దేహాన్ని ప్రారబ్ధానికి వదిలేసి, ఆ ప్రారబ్ధం యొక్క ప్రభావం మీ మీద పడకుండా చూసుకోవాలి అదీ సాధన. అబద్ధం చెప్పేవాడు ఎలా ఉన్నా ఫరవాలేదు కానీ నిజం చెప్పేవాళ్ళు బహుజాగ్రత్తగా ఉండాలి అది నేను జీవితంలో నేర్చుకున్న పాఠం అని గాంధీగారు చెప్పారు. వివేకానందుడు చాలా గొప్పవాడు. ప్రపంచ

ప్రఖ్యాతి పొందాడు. వివేకానందుడు తండ్రి ప్లీడరు చేసేవాడు. తండ్రి చనిపోయిన తరువాత ఈయనే ఇంటికి పెద్దవాడు కాబట్టి ఉద్యోగం చేసి తల్లినీ, తమ్ముళ్లనీ పోషించాలి. అక్కడేమో ఆయన జీవితాన్ని పరమహంసకు అర్పించుకున్నాడు. ఆయనకి ఏమి చెయ్యాలో తెలియటంలేదు. ఇంట్లో వాళ్లని చూడటమా? పరమహంసని నెత్తిమీద పెట్టుకొని తిరగటమా అని అనుకునేవాడు. నువ్వు ఏదేశం వెళ్లినా, ఎవరింటికి వెళ్లినా నేను నీ భుజాన్న ఉంటాను. నీకూడా వచ్చేస్తాను నరేన్ అనేవాడు రామకృష్ణపరమ హంస. ఇంకో ఆరు నెలలకి రామకృష్ణుడు శరీరం విడిచిపెడతారు అనగా మీ శిష్యుడు నరేంద్రుడి పరిస్థితి ఇంటిదగ్గర ఏమీ బాగాలేదు చాలా బాధలు పడుతున్నాడు అని ఎవరో అంటే అప్పడు నరేంద్రుడు దగ్గరే ఉన్నాడు. వీళ్లు మాట్లాడుకునేటప్పటికి రాత్రి ఎనిమిది అయ్యింది. రామకృష్ణుడు అన్నాడు ఇప్పడు మనం వెంటనే తెల్లవారమంటే తెల్లారిపోతుందా, పోదు అంటే రేపు ఆరింటికి కాని వెలుగురాదు. అలాగే వీడు పడవలసిన కష్టాలు పడ్డాకా వాడి జీవితంలో మహా వెలుగుని చూస్తాడు అన్నాడు. ఆ మహావెలుగు ఇప్పడే వచ్చేయాలంటే ఎలాగ వచ్చేస్తుంది. వాడు తినవలసిన మొట్టికాయలన్నీ తిన్నాక అప్పడు వెలుగువస్తుంది. వాడి దేహప్రారబ్దం అది. నరేన్‌కి మంచి సంబంధాలు వస్తున్నాయి అని చెబితే వాడి ప్రారబ్దంలో పెళ్లిలేదు అన్నాడు. 40వ సంవత్సరం జన్మదినోత్సవం చూచుకోకుండా చచ్చిపోతాడు ఈ రెండూ ఖాయం అన్నాడు. ఈలోపులో వాడు చేయవలసిన పని అంతా ఒక వెయ్యి సంవత్సరాలు బతికినవాడు ఎంతపని చేస్తాడో అన్ని మంచిపనులు చేసి వెళ్లిపోతాడు. ఒక చేత్తోటి సమాధి, ఇంకో చేత్తోటి లోకసేవ. నరేన్ రెండు చేతులతో పని చేస్తాడు అని చెప్పారు. వివేకానందుడు ఆరునెలలు బాగా స్ట్రగుల్ పడ్డాడు. మొత్తం ఈ ప్రపంచాన్నంతా ఇంటిలో ఉన్న ముగ్గురికోసం వదిలేయటమా? లేకపోతే ప్రపంచంకోసం వీళ్లు ముగ్గురినీ వదిలేయటమా ఈ ప్రశ్న వచ్చింది అన్నాడు స్వామీజీ. చివరికి ముగ్గురికోసం లోకంలో కోట్లాది మంది జనాన్ని విడిచిపెట్టకూడదు అని నిర్ధారణకు వచ్చాక లోకంవైపు జంప్‌చేసాకే మా తమ్ముడికి ఉద్యోగం వచ్చింది. కుటుంబాన్ని వాళ్లు పోషించుకున్నారు అన్నాడు. నువ్వు ఒక గ్రామానికి ఉపయోగపడుతున్నావు అనుకో నీ సేవ దేశానికి అవసరమైతే గ్రామాన్ని వదిలి దేశాన్ని చూడు. ప్రపంచసుఖం కోసం దేశాన్ని వదిలిపెట్టు. నువ్వు ఆత్మజ్ఞానం సంపాదించటానికి ప్రపంచాన్ని వదిలేయి. అంటేదానికి మించిన స్థితి లేదు. నేను శరణాగతి చెందాను నాకు శాంతి దొరకటంలేదని భగవాన్‌ని అడిగితే నువ్వు పొందిన శరణాగతి నిజమైతే నీకు అసలు అశాంతేరాదు. నువ్వు నిజంగా శరణాగతిపొందితే భగవంతుడి ఇచ్ఛకు బద్ధుడవై ఉండాలి. ప్రతీదీ భగవంతుడి సంకల్పం ప్రకారం నడుస్తుంది. మీరు భగవంతుడి సంకల్పాన్ని ఇష్టపడుతున్నారు

అనుకోండి మీకు శాంతి, భగవంతుడు సంకల్పాన్ని ఇష్టపడటం లేదు అనుకోండి ఇంక మీకు అశాంతి మిగులుతుంది. అన్ని పరిస్థితులలో, సర్వకాలసర్వావస్థలలో మీరు శాంతిగా ఉండాలని మేము చెబుతూ, మాకు సంఘటన వచ్చేటప్పటికి మేం అశాంతిగా ఉంటే భక్తులని అగౌరవ పరచినట్లు అవుతుంది. మంచి జరిగినా, చెడ్డ జరిగినా అవన్నీ స్వప్నమే. అయితే మనకి నమ్మకం ఉండాలి. నమ్మకం ఉంటే మనస్సు చెదరదు. భగవంతుడు మన శరీరంలో నేను అనే తలంపు పెట్టాడు అని రామకృష్ణుడు అనేవాడు. అది ఆయన అనుగ్రహం వలన తియ్యాలికాని మనం ఎన్ని పిల్లిమొగ్గలు వేసినా అది బయటికి పోదు అన్నాడు. ఏ ఈశ్వరుడు అయితే ఆ శరీరంలో నేను అనే తలంపు పెట్టాడో వాడే తప్పించాలి కాని ఆ నేను అనే తెరని మనం కత్తిరించలేము. ఆ నేను అనే తలంపు ఉన్నంతకాలం జన్మలు రాక మానవు. భగవంతుడి మీద నూటికి నూరుపాళ్ళు భారం వేసిన వాడికి ఒక్క తలంపు కూడా రాదు. ఆ నేనుని భగవంతుడు తియ్యాలంటే మనకి ఇష్టంలేకపోయినా ఆయన ఇష్టమే మన ఇష్టం, ఆయన సంకల్పమే మన సంకల్పం అని అంగీకరించాలి. ఈశ్వరుడు యొక్క అనుగ్రహం సంపాదించాలి. మనం చేయవలసింది ఏమిటి అంటే మాట ద్వారాకాని, చేతద్వారాకాని, ఆలోచనద్వారాకాని, భక్తిద్వారాకాని, పూజద్వారాకాని ఆయన అనుగ్రహాన్ని సంపాదించాలి. అదే మన జీవితలక్ష్యం.

బైబిలులో ఏసు అంటాడు నా మాటలన్నీ హైడ్రోజన్ బాంబులకంటే అత్యంత శక్తివంతములైనవి. ఆశక్తి వల్ల నా మాటలు నదులు, సముద్రాలు, దేశాలు, ఖండాలు దాటి వెళతాయి. నా సందేశాన్ని ప్రపంచం అంతా వ్యాప్తిచేస్తాయి. వాటిల్లో ఉన్న పవిత్రత అటువంటిది. ఒకోసారి ఒకో వాక్యము మీ హృదయంలో పడింది అంటే మీ హృదయంలో అపవిత్రత ఉంటే, అశాంతి ఉంటే, దుఃఖం ఉంటే వాటిని బయటికి గెంటేసి నిన్ను పవిత్రుడిని చేస్తాయి. భక్తిలోంచి వచ్చేమాటకి, వివేకంలోంచి వచ్చే మాటకి, పవిత్రతలోంచి వచ్చేమాటకి అంతశక్తి ఉంది. దేవుడిని మనం మాటలతోటి స్తోత్రం చేస్తాము. అది అంతా భక్తిలోకి వస్తుంది. కర్మ అంటే ఏమిటి అంటే మనం చేసే పనులు నిర్మలంగా ఉండాలి. ఉద్రేకంగా చేయకూడదు. నిశ్చలంగా ఉండాలి. పనిలో ఆడంబరం ఉండకూడదు. సహజంగా ఉండాలి. మనం భగవంతుడికి సంతోషం కలగచేసే కర్మ చేయాలి. పని అంటే అక్కడ అవసరం అనుకుంటే చెయ్యటం అంతేగాని గౌరవాలకోసం, కీర్తికోసం చెయ్యకూడదు. భగవంతుడు దయ సంపాదించటానికి కర్మ ఉపయోగపడాలి ఇలా చేస్తూ ఉంటే ఈ నేనుని ఆయనే తీసేస్తాడు. కాని నువ్వు ఊడగొట్టుకోలేవు. నీకు మమకారం ఉండగా మంచి పనులు చేస్తే పుణ్యం వస్తుంది కాని చిత్తశుద్ధి రాదు. మమకారాన్ని విడిచిపెడితే చిత్తశుద్ధి వస్తుంది. అహంకారాన్ని

విడిచిపెడితే జ్ఞానం వస్తుంది. ఈశ్వరుడు అంటే సృష్టిని పరిపాలించేవాడు. మనకందరికీ భర్త, యజమాని ఈశ్వరుడు ఆజ్ఞ లేకుండా ఏమీ జరగటానికి వీలులేదు, ఏమీ జరగదు. పిల్లలు బట్టలు బాడిచేసుకుంటే రెండు దెబ్బలు కొట్టి మళ్ళీ స్నానం చేయించి కొత్తబట్టలు వేస్తారు. అలాగే మన జీవకోటిని కూడా అవసరమైతే నాలుగు దెబ్బలు వేస్తాడు. అలా వేసి వదిలేయడు మళ్ళీ మనల్ని తీసుకుంటాడు. మనలని దెబ్బలు కొట్టినా, ఆయన ఒడిలోకి తీసుకున్నా మనల్ని పరిశుద్ధం చేయటానికే. గురువు అంటే అనుగ్రహమే. మనల్ని తాకినా, మనల్ని చూసినా, మనతోటి మాట్లాడినా, మాట్లాడక పోయినా అనుగ్రహమే. గురువు పని చేస్తున్నట్లు మన కళ్ళకు కనిపిస్తాడు. కాని నేను పని చేస్తున్నాను అనేవాడు అక్కడలేడు. ఆయన ద్వారా పని జరిగిపోతూ ఉంటుంది. అక్కడ సంకల్పం ఉండదు. నేను వాళ్ళని బాగుచేయాలి, వీళ్ళని బాగుచేయాలని అని గురువు అనుకోడు. ఆయన ద్వారా శక్తితరంగాలు, జ్ఞానతరంగాలు ప్రపంచం అంతా వ్యాపిస్తాయి.

సోక్రటీస్‌ని జైలులో పెట్టి విషం ఇచ్చి చంపేసారు. మరుసటిరోజు విషం పెడతారనగా కొంతమంది భక్తులు వచ్చి మేము జైలు తలుపులు బద్దలుకొట్టేస్తాం మనం పారిపోదాం అన్నారు. సోక్రటీసు అన్నాడు నా శరీరం చనిపోయే టైము వచ్చింది. మీరు ఇంకా కొంతకాలం బతకాలి ఇది ఈశ్వరుని నిర్ణయం. మీరూ, నేనూ కూడా ఈశ్వరుని నిర్ణయం గౌరవిద్దాము. గొర్రె వెళ్ళి కొండనేసి కొట్టుకుంటే ఎవరికి నష్టం. గొర్రెకే నష్టం. భగవంతుడి సంకల్పాన్ని మనం ఢీకోవటం కూడా అటువంటిదే. ఈశ్వరుడు ప్రణాళిక ప్రకారం ఈ సృష్టిని నడుపుతూ ఉంటాడు. కర్మఫలం అనుసంధానం చేస్తూ ఉంటాడు. మీకు భగవంతుడు మీద తప్పించి అనురక్తి ఎక్కడా ఉండకూడదు. మీ ఇంట్లో వాళ్ళపట్ల మీరు డ్యూటీ చెయ్యండి మనస్సు మటుకు భగవంతుడి మీద ఉండాలి. మీ మీద మీకు ఎంత ప్రేమ ఉందో దేవుడి మీద కూడా అంత ప్రేమ ఉండాలి. దేవుడి మీద అంత ప్రేమ ఉంటే మీకు దేవుడు లభ్యమవుతాడు. ఆ ప్రేమలో ఏమీ స్వార్ధం కనపడకూడదు. ఆ ప్రేమ ప్రవాహం కింద ఉండాలి, మీరు అనుకున్న పనులు అవ్వవు అనుకోండి ప్రేమతగ్గిపోతే ఆ ప్రేమ అబద్ధం. అది వ్యాపార ప్రేమ, కపట ప్రేమ. వేసవికాలంలోను, వర్షాకాలంలోను కూడా సముద్రం ఎంత నిండుగా ఉంటుందో మీకు పనులు అయినా, అవ్వకపోయినా భగవంతుడి పట్ల ప్రేమ అలా ప్రవహిస్తూ ఉండాలి. అప్పుడు ఆయన లభ్యమవుతాడు. మనకు దేహములో నేను అనే తలంపు ఉందో లేదో మనకు తెలుస్తోంది కదా. దేహములో నేను అనే తలంపు మనలో ఉన్నప్పుడు నాకు జ్ఞానం వచ్చేసింది, బ్రాహ్మీస్థితి పొందాను అని ఇటువంటి పిచ్చిమాటలు చెప్పకండి. దేహములో నేను ఉన్నంతకాలం రాముడి

దగ్గర ఆంజనేయస్వామి ఎలా ఉన్నాడో మీరు కూడా భగవంతుడి దగ్గర అలా ఉండండి. అంటే రాముడి పనే ఆంజనేయస్వామి పని, రాముడి ఇష్టమే ఆంజనేయస్వామి ఇష్టం. అలాగ మనం ఉంటే బాగుపడతాము, అంతేగాని దేహములో నేనుని పెట్టుకొని నేనే రాముడిని అనుకుంటే ప్రయోజనం లేదు దానివలన మనం చెడిపోతాము. అసలు రోగం ఏమిటో మనకు అర్థం అవ్వాలి. రోగం అర్థం అయ్యాకా రోగానికి తగిన మందు వాడాలి.

మనం దేవుడి తోటి ఎలా ఉండాలంటే నీ ఇష్టమే నా ఇష్టం, నీ సంకల్పమే నా సంకల్పం, నేను స్వతంత్రుడను కాదు, నీ ఆజ్ఞ శిరసావహిస్తాను అనుకొంటూ ఆరకంగా జీవించాలి. కాని మన దేహంలో అహంకారం పెట్టుకొని, గర్వం పెట్టుకొని మాకేదో జ్ఞానం వచ్చేసింది అంటే మనల్ని మనం మోసం చేసుకున్నట్టు అవుతుంది. జీవుడి రూపంలో ఉన్న వాడు దేవుడే. ప్రతీదానికి మీ మనస్సుని మీరు బాధపెట్టుకుంటున్నారు అనుకోండి మీరు దేవుడిని అగౌరవ పరుస్తున్నట్టు, దేవుడిని పీడిస్తున్నట్టు అవుతుంది. ఎందుచేత అంటే ఈ జీవుడు దేవుడివాడు. ఇతరులను హింసపెట్టటం ఎంతపొరపాటో మిమ్మల్ని మీరు హింసపెట్టుకోవటంకూడా అంతే పొరపాటు. ఈ దేహాలని ఇచ్చినవాళ్ళు తల్లితండ్రులు. జ్ఞానం ఇచ్చినవాడు కూడా తండ్రితోటి సమానమే. స్వామీజీవాళ్ళు రామకృష్ణుడిని, రామకృష్ణా అని ఎప్పుడూ పిలవలేదు అంటే దేవుడే గురు రూపంలో ఉన్నాడు. అందుచేత గురుదేవ్ అనేవారు. ఎవరూ మిమ్మల్ని చూచి జాలిపడటం లేదు అనుకుంటారు. ఎందుకు మిమ్మల్ని చూచి జాలిపడటం అదొక బలహీనత. భగవంతుడు చెప్పిన వాక్యాన్ని మీరు పూర్తిగా నమ్ముతారు అనుకోండి మనస్సు అక్కడ ఆగిపోతుంది. శాస్త్రాన్ని అనుసరించి మనం నడిస్తే బాధలు ఉండవు. శాస్త్రాన్ని ధిక్కరించి నడిస్తే మనం దారి తప్పిపోతాము. తప్పదారిలో మనం వెళుతూ ఉంటే మనల్ని రైటు మార్గంలో పెట్టటానికే భగవంతుడు మొట్టికాయలు మొడతాడు.

మేకల మందను చూస్తే అందులో కొన్ని కుంటిమేకలు ఉంటాయి. ఇవి తొందరగా వెళ్ళలేవు. మిగతామేకలు గబగబా వెళ్ళిపోతాయి. బుద్ధుడు, ఏసు ఎంతకరుణామయులు అంటే ఆ కుంటి మేకల బాధచూడలేక వాటిని భుజానవేసుకునేవారు. వారు కరుణామయులు. దేహగతమైన నేనుని విడిచిపెడితే అందరూ కరుణామయులే, అందరూ దయామయులే. అజ్ఞానంలోంచి, మాయలోంచి ఎప్పుడైతే బయిటికి వచ్చాడో అప్పుడు సముద్రంలో ఎంతనీరు ఉంటుందో వాడి హృదయంలో అంత దయ ఉంటుంది, అంత జ్ఞానం ఉంటుంది. ఆ దయకు జ్ఞానానికి పరిమితులు లేవు. ఒకసారి రామకృష్ణుడు మాట్లాడుతూ దేవుడు లేడా అంటే ఉన్నాడు కాని ఆయన మన మాటకి అందడు, మనస్సుకి అందడు, మన ఇంద్రియాలకి అందడు

అని చెబుతూ ఉంటే, మరి ఎవరికీ అందకపోతే ఎలా చెబుతున్నారు అని రామకృష్ణానంద అడిగారు. బుద్ధికి అందని మాట నిజమే కాని శుద్ధబుద్ధి అయితే, పవిత్రమైన బుద్ధి అయితే, ఏకాగ్రమైన బుద్ధి అయితే, యోగ్యమైన బుద్ధి అయితే భగవంతుడు వాడికి అందుతాడు. అంటే స్వపరభేదం ఎలా ఉంటుందో తెలియని వాడికి అందుతాడు అన్నాడు. తల్లి పిల్లలకు ఆడుకోవటానికి బొమ్మలు ఇస్తుంది. పిల్లలు ఆ బొమ్మలతో ఆడి ఆ సరదా అయిపోయిన తరువాత అమ్మా అని ఏడుస్తారు అప్పుడు తల్లి వచ్చి ఎత్తుకుంటుంది. అలాగే ఈ ప్రపంచంలో ఉన్న భోగాలు, సరదాలు ఎంజాయ్‌మెంట్స్ ఈ ఆట అంతా అయిపోయిన తరువాత ఇది అంతా లీల అని నీకు అర్ధమయి వీటిమీద మీకు విరక్తి ఎప్పుడైతే వచ్చిందో అప్పుడు భగవంతుడికోసం ఏడవటం మొదలుపెడతారు. అప్పుడు భగవంతుడు వచ్చి మిమ్మల్ని ఆయన ఒడిలో వేసుకుంటాడు అని రామకృష్ణుడు చెప్పాడు. మీమీద మీకు ఎంత ఇష్టం ఉందో ఈశ్వరుడిమీద అంత ఇష్టం ఉండాలి.

జ్ఞానం అంటే కేవలం తెలివితేటలకి సంబంధించినది కాదు. కొంతమంది ఈతల కాయకి సంబంధించినదే జ్ఞానం అనుకుంటారు, జ్ఞానం అనేది మహాసాగరం. మీరు జ్ఞాన సాగరంలోకి వెళితే పుట్టుక అనీ, చావు అనీ, మంచి అనీ, చెడ్డ అనీ, పాపమనీ, పుణ్యమనీ ఈ బేధబుద్ధిలోంచి బేధం ఎలా ఉంటుందో తెలియని స్థితిలోకి వచ్చేస్తారు. దీనికి ఈశ్వరానుగ్రహం ఉండాలి. నువ్వు వేరు, నేను వేరు అనే బుద్ధి ఇది అంతా మాయ. మాయకి యజమాని భగవంతుడు. నన్ను ఈ మాయలోంచి విడిచిపెట్టు అంటే భగవంతుడు విడిచిపెట్టడు. ఆయన పట్ల మనకు ఉన్న ప్రేమ నిజమైనది అయితే ఆయన ప్రేమకూడా మన శిరస్సు మీద వర్షిస్తుంది. అప్పుడు మాయ దారి ఇస్తుంది. భగవంతుడు కూడా ఎన్నో చమత్కారాలు చేస్తాడు. రామకృష్ణుడు ఏమన్నాడు అంటే నేనొక యంత్రాన్ని నువ్వు ఈ యంత్రాన్ని నడిపేవాడవు. మనకి ఇష్టం ఉన్నా, ఇష్టంలేకపోయినా ఆయన ఎలా నడిపిస్తే అలా నడవవలసిందే. ఇది అసాధ్యము అని మనం అనుకున్నది భగవంతుడు సాధ్యం చేస్తాడు. ఇది సాధ్యమే అని మనం అనుకుంటే అది జరగకుండా చేసేస్తాడు. ఏమిటి అని ఆశ్చర్యపోకండి. ఆయన ఈ సృష్టికి యజమాని. ఇది ఆయన లీల, ఆయన ఆట, ఆయన మాయ. మనం ఈ లీలలో ఒక భాగం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-06-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పరమాత్మ భగవద్గీతలో ఏమని చెప్పాడంటే మీరు పని చేసి వదిలెయ్యండి, ఫలితం కోసం ఎదురుచూడవద్దు అని చెప్పాడు. అలాగ పనిచేస్తే మీకు శాంతిగా ఉంటుంది అని

చెప్పాడు. మీ పిల్లలు మిమ్మల్ని చూడాలని ఎప్పుడూ అనుకోవద్దు. మీ డ్యూటీ మీరు చేసి వదిలెయ్యండి. పిల్లలు మిమ్మల్ని చూస్తే మంచిదే, చూడకపోతే నన్ను ఎందుకు చూడటంలేదు అనుకుంటే చివరకు మీ మనస్సు కుళ్ళిపోతుంది, మీరు దేవుడికి దూరం అయిపోతారు, మీకు అశాంతి వచ్చేస్తుంది. ఒకో మనిషి స్వభావం ఒకోరకంగా ఉంటుంది. వాళ్ళు అలాగే ఉంటారని వదిలేయాలిగాని వారిలో ఏమీ మార్పు రావటంలేదు ఏమిటి అని ఇలా చాదస్తంగా అనుకోవటం వలన చివరకు మీరు పాడైపోతారు ప్రతీ విషయానికి మనకాళ్ళమీద మనం నిలబడాలి. మీ కోడలు చూస్తేసరేసరి చూడకపోతే చూడలేదు అనుకోవద్దు. ఇది కలియుగం. మీకు వచ్చిన సంకల్పాలను వదిలేయండి. మీకు వచ్చిన తలంపులను వదిలేయండి, మీకు వచ్చిన ఆలోచనలను వదిలేయండి అప్పుడు మీరు బాహ్యంగా ఏ వస్తువులను వదిలిపెట్టనక్కర్లేదు అన్నారు భగవాన్. మానవుడు సహజంగా నూటికి నూరుపాళ్ళు స్వార్ధపరుడు. స్వార్థం లేకుండా ఎవరైనా ఉంటే మనం ఆశ్చర్యపోవాలికాని, స్వార్థం ఉన్న వాడిని చూసి ఆశ్చర్యపోనక్కరలేదు. అది నేచురల్. మీ అబ్బాయికి మిమ్మల్ని చూసే అలవాటు లేదు వాడు మిమ్మల్ని చూడడు. వాడు నన్ను చూడటంలేదు అని అనుకోవలసిన పని ఏమిటి మీకు? మనం ఆ ఇంట్లో పుట్టాము కాబట్టి మన డ్యూటీ మనం చెయ్యాలి అంతే, డ్యూటీ చెయ్యకపోతే భగవంతుడు క్షమించడు. భర్త ఎవరు, భార్య ఎవరు ఇవన్నీ కల్పితాలు. వారికి మనకి ఏమీ సంబంధం లేదు. మనం అందరము భగవంతుడికి సంబంధించిన వారము. భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. మనం లేనిపోని గొడవలు పెట్టుకొంటే భగవంతుడు దగ్గరకి చేరుకోలేము.

మనిషి ఒంటరిగా పుడతాడు, వాడి దేహప్రారబ్దాన్ని అనుసరించి జీవిస్తాడు, ఒంటరిగా వెళ్ళిపోతాడు. నేను ప్రారబ్దం అనుభవిస్తున్నాను అని నీ దేహం అనుకోదు, నీ మనస్సే నేను ప్రారబ్దం అనుభవిస్తున్నానని చెబుతుంది. ఏ మనస్సు అయితే నిన్ను బాధపెడుతుందో ఆ మనస్సు నువ్వు కాదని ఎన్ని వందలుసార్లు చెప్పినా నువ్వు వినవు ఏమిటి అన్నారు భగవాన్. అదే మాయ. మరి నిద్దట్లో నీ మనస్సు లేదు కదా! మనస్సు లేనప్పుడు నిద్రలో స్త్రీలు అని, పురుషులు అని, కష్టము అని, సుఖము అని ఏ సమస్యా లేదు కదా! ఈ మనస్సు వస్తే అన్నీ వచ్చేస్తాయి. దేవుడు వచ్చాడు, దేహము వచ్చింది, మనస్సు వచ్చాక దుఃఖము వచ్చింది, అశాంతి వచ్చింది. ఈ మనస్సు ఎంత నిజమో ఇవన్నీ కూడా అంతే నిజము. మనస్సుపోతే అన్నీ పోతాయి. మీరు సబ్జక్టు క్లోజుగా అర్థం చేసుకుంటే మీరు ఇంటికి వెళ్ళి జపం చెయ్యకుండా మీకు దుఃఖం ఆరిపోతుంది. డబ్బులేని వారందరూ డబ్బు వస్తే సుఖం వస్తుంది అనుకుంటారు, చదువులేనివారు

చదువు వస్తే సుఖం వస్తుంది అనుకుంటారు. ఇవన్నీ అబద్దాలు. మన మనస్సు అలా చెబుతుంది. ఎంత పాండిత్యం ఉన్నా, ఎంత ధనం ఉన్నా వాడికి మనోనిగ్రహం లేకపోతే పశువుతో సమానం అని శాస్త్రం చెప్పింది. మనం ఇప్పుడు లోకంలో ఉన్నాము, రాముడు కూడా ఒక టైములో లోకంలో ఉన్నాడు. అయితే రాముడు దేవుడు ఎందుకు అయ్యాడంటే రాముడు లోకంలో ఉన్నాడు కాని లోకం ఆయనలో లేదు అందుకు రాముడు దేవుడు అయ్యాడు. మనం లోకంలో ఉన్నాము, మన లోపల ఉన్నదంతా లోకమే అందుచేత మనం జీవుడు అయ్యాము. మనం పుట్టిన నక్షత్రం మంచిదికాదు, తిథి మంచిదికాదు, వారం మంచిదికాదు అని ఏడుస్తూ కూర్చోకండి. మన తప్పలు నక్షత్రాలలో, సూర్యుడులో, చంద్రుడులో లేదు. మనం చేసిన పొరపాట్లు అన్నీ మనలోనే ఉన్నాయి. నీలో ఏ బలహీనత ఉందో జాగ్రత్తగా చూసుకో. ఆ బలహీనతని బయటకు లాగి కాల్చి బూడిద చెయ్యి. నువ్వు చెయ్యవలసింది అది. అంతేగాని నక్షత్రాలని, తిథిలని తిడుతూకూర్చోవద్దు. అలా జీవిస్తూ ఉంటే నీ బతుకు అంతా వేస్టు అయిపోతుంది.

మీ కర్మ మీకు అనుభవంలోనికి వచ్చేవరకూ తెలియదు, అది దేవుడికి తెలుసు. దేవుడు జీవకోటి ప్రారబ్దాన్ని తన పొట్టలో దాచుకొని ఆ ప్రారబ్దం అనుభవించే టైము వచ్చినప్పడు నెమ్మదిగా దానిని జత కలుపుతాడు. వాడు దేవుడు. మన స్వరూపంలోనే సుఖం ఉంది, మన స్వరూపంలోనే శాంతి ఉంది. పునర్జన్మ లేనిస్థితి కూడా మన స్వరూపంలోనే ఉంది. ప్రపంచంలోంచి ఏ రకమైన గౌరవంకోరినా, ఏ రకమైన సుఖం కోరినా ఈ సుఖాలు అన్నీ కూడా పరిణామంలో రెట్టింపుకి, రెట్టింపు అశాంతిగా, దుఃఖంగా మారిపోతుంది. మనం భగవంతుడిని చేరేవరకూ ప్రయాణం విడిచిపెట్టకూడదు. ఈలోపులో వారు చూడటంలేదు, వీరు చూడటంలేదని ప్రయాణం ఆగిపోతే మళ్లీ జన్మలు పెరుగుతాయి, శవాలను ఎక్కువ మొయ్యాలి. సారా తాగటంవలన వచ్చే మత్తు కంటే అజ్ఞానం వల్ల వచ్చే మత్తు ఎక్కువ. సారా తాగినవాడికి మూడు గంటలో, నాలుగు గంటలో మత్తు ఉంటుంది. అజ్ఞానం వల్ల వచ్చే మత్తు లక్షలాది జన్మలు తీసుకువస్తుంది. అజ్ఞానం వలన ఇది ధర్మం, ఇది అధర్మం, ఇది సత్యం, ఇది అసత్యం అని వాడికి తెలియదు. అజ్ఞానం ఉన్నప్పడు డిటాచ్‌మెంటు ఉండదు. ఇప్పడు మనం అందరం అజ్ఞానం అనే మత్తులో ఉన్నాము. ఈ మత్తు మనలని కొన్నివేల జన్మలు ఈడ్చేస్తుంది, అది మనకు తెలియటంలేదు. ఇక్కడ మీరు అందరూ వింటున్నారు ఆ రోడ్డు మీదకు వెళ్ళాక ఎవరో ఏదో చెబితే ఇవి అన్నీ మీకు అబద్ధాలు అనిపిస్తాయి. ఎందుచేత అంటే మీకు సొంత ఆలోచన లేకపోవటం వలన అలా అనిపిస్తుంది. మీకు లోపల సాధనాబలం లేదు, ఆలోచనాబలం

లేదు, పుణ్యబలం లేదు. మనిషికి పుణ్యబలం ఎంతోకొంత ఉండాలి. నీకు ఎవరైనా అపకారం చేసినా, నిన్ను ఎవరైనా పరుషవాక్యాలు మాట్లాడినా నువ్వు ఎవ్వరినీ ద్వేషించవద్దు. మనం ద్వేషించటం వలన మన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. ఇంక రాముడు జ్ఞాపకం రాడు. మీరు ఎవరినైతే ద్వేషిస్తున్నారో వారే జ్ఞాపకం వస్తారు. వాల్మీకి చెప్తాడు రాముడిని ఆరాధించండి, రాముడిని పూజించండి, రాముడిని స్మరించండి మోక్షాన్ని పొందండి అని చెప్తాడు. రామనామం చేసి, రామనామం చేసి గాంధీగారు మహాత్ముడు అయ్యాడు. మీరు ఈశ్వరుడిని నిరంతరం స్మరించటంవలన మీకు పనికిరాని అలవాట్లు ఏమైనా ఉంటే అవి అన్నీ పోతాయి. వాసనలు బలంగా ఉన్నప్పుడు పోవు అని అనుకుంటాము. కాని ఈశ్వరుడు దయకు అన్నీ సాధ్యమే. అన్ని అలవాట్లు పోతాయి.

మీరు జరిగిపోయిన గొడవలు గురించి ఆలోచించకండి, వాటిని వదిలెయ్యండి. జరిగిపోయిన కాలం జరిగిపోయింది. నువ్వు ఇంక 20సం॥లో, 30సం॥లో బతుకుతావు కదా! ప్రతీ నిమిషాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకో. కాలాన్ని వేస్టు చెయ్యకూడదు. మీకోసం ఎవరైనా పనుండి వచ్చారనుకోండి వారితో మాట్లాడి పంపించేయండి కానీ బాతాకానీ గొడవలలోకి వెళ్ళకండి. ఆ గొడవలలోకి మీరు వెడితే వారు మీ మైండును పొల్యూట్‌చేసి వెళ్ళిపోతారు అది మీకు తెలియదు. వంటిఇంట్లో పొగ ఎక్కువ ఉంటే గోడలకి మసి ఎలా పట్టేస్తుందో అలాగ కొన్ని స్నేహాలు మీ మైండును శుభ్రంగా పాడుచేసి పోతాయి. అందుచేత స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండండి. వర్తమానకాలం జాగ్రత్తగా ఉపయోగించుకోండి. మనిషికి దుఃఖం కర్తృత్వం వల్ల వస్తుంది. కర్త నువ్వు కాదు. భగవంతుడు కర్త. నేను కర్తని అనుకోవటం వలన దుఃఖం వస్తుంది. నువ్వు కర్తవు కాదని నీకు తెలిసే వరకు నిన్ను దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. కంచి పీఠాధిపతి సలహామీదే బ్రంటన్ భగవాన్ దగ్గరకి వచ్చాడు. భగవాన్ సమక్షంలో కూర్చున్నాడు బ్రంటన్. భగవాన్ ఆయనతో మాట్లాడలేదు. ఒకోసారి దూరంగా శూన్యంలోకి చూస్తున్నాడు, ఒకోసారి బ్రంటన్‌వంక చూస్తున్నాడు. ఈయన నన్ను చూసినా ఫరవాలేదు, నా మనస్సుని చదువుతున్నాడు. నా మనస్సులో ఉన్న బలహీనతలు అన్నీ ఆయనకి తెలుస్తున్నాయి. ఆయనకి తెలిసినా ఫరవాలేదు. ఆయనకి తెలిసిపోతున్నాయి అన్న సంగతి నాకు తెలుస్తోంది. అందుచేత నాకు దుఃఖం వస్తోంది, అశాంతి వస్తోంది అంటాడు బ్రంటన్. గురువు ఏమి చేస్తాడు అంటే నువ్వు ఇటువంటివాడు, అటువంటివాడు అనడు. నీ మనస్సులో ఏ బలహీనతలు ఉన్నాయి, ఏ కారణాల వల్ల శవాలు మొయ్యాలి, ఏ కారణాల వలన మళ్ళీ పునర్జన్మలు వస్తాయి అని ఆ కారణాలు చూసి, వాటిని

తీయటానికి వీడికి ఎలా సహకరించాలి అని మౌనంతో భగవాన్ పనిచేస్తున్నారు. ఆయన చేసేపని ఏదో చేసేస్తూ ఉంటాడు. బ్రంటన్ ఏమనుకుంటున్నాడు అంటే మహర్షి నాతో మాట్లాడటం లేదు అనుకుంటున్నాడు. ఒక్కసారి జ్ఞాని దగ్గరకు వెళ్ళినవాడు ఎవడూ వట్టిచేతులతో రాడు. జ్ఞాని దర్శనం చాలు. ఆయన చేసేది నీ కళ్ళకు కనబడదు. నీలోపల జరిగే మార్పు నీకు తెలియదు.

ప్రారబ్ధాలు రకరకాలుగా ఉంటాయి. కొంతమందికి తినాలంటే ఏమీ దొరకదు. ఆకలితో బాధపడుతూ ఉంటారు. కొంతమందికి ఇంటినిండా అన్నీ ఉంటాయి, ఏది తిన్నా అరగదు. ఇవి అన్నీ వ్యవహారిక సత్యములే. మనస్సు ఎంత నిజమో ఇవి అన్నీ అంతే నిజం. మనస్సు దాటితే ఈ గొడవలు లేవు. నిద్రలో మనకు ఏ గొడవలేదు. నిద్రలో మనం ఉన్నాము. కాని ఎలా ఉన్నామో మనకి తెలియటంలేదు. జాగ్రదవస్థలో సాధన చేసి నిద్రావస్థలో ఉన్న స్థితిని తెలుసుకోవాలి అంటున్నారు భగవాన్. నిద్రావస్థలో ఏది లేకపోవటం వలన మనం సుఖంగా ఉన్నామో దానిని జాగ్రదవస్థలో ప్రయత్నం చేసి పోగొట్టుకుంటే ఆ సుఖం అంతా జాగ్రదవస్థలో వచ్చేస్తుంది అదే మన కడసారిజన్మ. భగవాన్ చెప్పేది మనస్సులేని స్థితికి ఎదిగి వెళ్ళాలి అన్నారు. శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే పాము నోట్లో ఎంత విషం ఉంటుందో దేహబుద్ధిలో అంత విషం ఉంటుంది అని చెప్పాడు. పాము నోటిలో ఉన్నంత విషం మనలో ఉంది. ఆ విషం అంతా కక్కితేగాని మనకి జ్ఞానం కలుగదు. సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా వాటితో కలిసిపోవద్దు. సమానంగా వ్యవహరించు. సహనం నేర్చుకో. మనం ఏ విషయం గురించి అయినా ఉద్రేకపడుతూ ఉంటే తప్పలు చేస్తాము అని వాల్మీకి చెప్పాడు. మనం ధైర్యంగా ఉండాలి. ధైర్యం కూడా పాజిటివ్‌గా ఉండాలి కాని నెగిటివ్‌గా ఉండకూడదు. నెగిటివ్‌గా ఉంటే మీ ధైర్యం ఇతరులకు చెడ్డ చేస్తుంది కాని మంచి చేయదు. ఇతరులు మంచివారా, చెడ్డవారా అనే గొడవవద్దు. వారు చెడ్డవారైతే వారితో కలవవద్దు దూరంగా ఉండు. అందులో తప్పలేదు కాని లోపల ద్వేషం పెట్టుకోవద్దు, లోపల మైత్రీభావంతో ఉండు. అందరిపట్ల ప్రేమ కలిగిఉంటే, దయకలిగి ఉంటే ఆ గుణం వలన కూడా ఈశ్వరుని దయ మీకు కలుగుతుంది.

కృష్ణుడు ఆడిన మాట తప్పాడు అంటే తనకోసం తప్పటంలేదు. ఇతరులకోసం తప్పాడు అది మనం గుర్తించాలి. ఎవరినైనా చూసేటప్పడు లోపల వారి హృదయం ఎలా ఉంది అని చూడాలి. కాని వారు మాట్లాడేమాట పట్టించుకోనక్కరలేదు. రామనామం స్మరించటంవలన, రాముడి రూపాన్ని ధ్యానించటం వలన మనకు తెలియకుండానే మనలో ఉన్న కల్మషం పోతుంది.

లోకంలో ఉన్న రూపాల గొడవలలోనికి వెళ్ళవద్దు. లోకంలో ఉన్న ఏరూపాన్ని తలపెట్టుకొన్నా, ఏ నామాన్ని స్మరించినా నీకు తెలియకుండా అహంకారం పెరిగిపోతుంది. దేహానికి సంబంధించిన వారు ఎవరు జ్ఞాపకం వచ్చినా దేహబుద్ధి పెరిగిపోతుంది. ఒక శాస్త్రవేత్త అవ్వాలన్నా, ఒక ఋషి అవ్వాలన్నా, ఒక మహాత్ముడు అవ్వాలన్నా బాహ్యదృష్టి ఉన్నవాడు అవ్వలేడు. అంతర్దృష్టి ఉండాలి. అంతర్ దృష్టి ఉన్నవాడు ఏదైనా సాధించగలడు. లోపల ఉన్న సుఖం నీ చేతికి అందనప్పడు సుఖం కోసం బయట వెతుకుతూ ఉంటావు, గౌరవాలు ఆశించేవాడు లోకానికి సంబంధించిన నిర్ణయాలలో కూడా తప్పలు చేస్తారు, లోపల ఉన్న సుఖాన్ని పోగొట్టుకుంటాడు. కీర్తికాంక్ష ఉన్నవాడు వాస్తవపరిస్థితులకు దూరంగా ఉంటాడు. ప్రారబ్దంలో రావలసింది వస్తుంది రియాక్షన్ వద్దు అది అలా ఎందుకు జరిగింది అని మనస్సును పాడుచేసుకోవద్దు. ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు. అది అలా జరగవలసి ఉంది జరిగింది అంతే. మీరు ఎవరినైనా గౌరవంగా చూస్తారు అనుకోండి, వారు మిమ్మల్ని గౌరవంగా చూడటంలేదు అనుకోండి వారు మిమ్మల్ని గౌరవంగా చూడటంలేదు అని అనుకోవటం వలన కూడా మీరు భగవంతుడికి దూరం అవుతారు. అది జ్ఞాపకం పెట్టుకోండి. ఇటువంటి చిన్న విషయాలలో కూడా జాగ్రత్తగా ఉండాలి. అంటే ప్రతీ క్షణం జాగ్రత్తగా ఉండాలి. ప్రతీ చిన్న విషయానికి మనస్సును గాయం చేసుకొంటే మీరు పాడైపోతారు, నాకు దూరం అయిపోతారు అంటున్నాడు పరమాత్మ.

భౌతికమైన సంఘటనలవల్ల వచ్చే బాధలకంటే మన అజ్ఞానం పెట్టే బాధలు ఎక్కువ ఉంటాయి. మొత్తం ప్రపంచంలో ఉన్న శాస్త్రాలు అన్నీ నేర్చుకొని అందులో మీరు పాండిత్యం సంపాదించినా, ఒక జ్ఞాని చూపుకు సరిపోవు, ఒక జ్ఞాని దయకు సరిపోవు అవి. జ్ఞాని అంటే ఆత్మఅయి ఉన్నాడు. ఒక జ్ఞాని యొక్క దయ మీకు కలిగితే ఇంక మీకు శాస్త్రాల గొడవలేదు, సాధన గొడవలేదు. అది జ్ఞానం యొక్క వైభవం. మీకు వచ్చే పాడు ఆలోచనలు, సంకల్పాలు, తలంపులు అవి వదులుకోండి. ముందు లోపల కల్మషాన్ని మీరు వదులుకొంటూ ఉంటే మీరు ఇంక బయటకు ఇచ్చేది ఏమీలేదు. లోపల కల్మషాన్ని పెట్టుకొని వారికి అరటిపండు ఇచ్చాను, మామిడిపండు ఇచ్చాను అన్నా నీకు ప్రయోజనం లేదు అని భగవాన్ చెప్తున్నారు. మన శరీరం కంటే, మన మనస్సుకంటే, మన ఇంద్రియాలుకంటే, మన బంధువులకంటే, మన స్నేహితులకంటే అత్యంత సమీపంలో ఉన్నవాడు దేవుడు. వాడిని గుర్తించలేక లేడు అంటున్నాము. మన అవిద్యవల్ల, మన పొగరుబోతుతనం వల్ల వాడు ఉన్నా వ్యక్తము కావటంలేదు. ఈ అజ్ఞానం అనే మత్తు అనేక జన్మల నుండి వస్తోంది. ఒక మహాజ్ఞాని యొక్క దయవలన ఈ అజ్ఞానంలోంచి బయటకు రావాలికాని కేవలం మన తెలివితేటల వలన బయటకు రాలేము.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జూలై | 7 | హైదరాబాద్, సత్యసాయి నిగమ్, గురుపౌర్ణమి |
| జూలై | 19 | జిన్నూరు, రమణ క్షేత్రం |
| ఆగష్టు | 7 | తాడినాడ |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# గురుసాక్షాత్ పరంబ్రహ్మ

గురువు అనగా సకల చరాచర సృష్టికి ఆధారంగా ఉన్న అద్వయ బ్రహ్మమే! గురువంటే ఒక వ్యక్తికాదు ఒక సిద్ధాంతంకాదు; గురువంటే చైతన్యం, జ్ఞానదీపం. మూర్తీభవించిన వేదసారమే జీవకోటిని తరింపజేయుటకు మానవాకృతులు ధరించి గురురూపంలో ఈ భూమి మీదకు వస్తూ ఉంటారు. అందువల్లనే మన సనాతన సంప్రదాయంలో "శ్రీగురుభ్యోనమః" అని గురువందనముతో విద్యాభ్యాసం మొదలవుతుంది. ఆత్మజ్ఞాన ప్రసార మాధ్యమములుగా దేహధారియైన గురువులు పరమాత్మచే ఎంపిక చేయబడతారు. ఆత్మజ్ఞానం కలిగియుండడం ఒక ఎత్తు, దానిని సామాన్యులకు అర్థం అయేటట్లు బోధించి, వారిచేత ఆచరింపచేయడం ఒక ఎత్తు. సద్వస్తువు గురించి ఆ సద్వస్తువే తానై బోధిస్తూ, ఏదైతే ఉందో దాని తాలూకు ఎరుకను కలిగిస్తూ, ఎలా జీవిస్తే ఆత్మజ్ఞానం కలుగుతుందో అలా జీవించి చూపుతారు గురువు. పూర్ణజ్ఞానం యొక్క విలువ అందరికి తెలియనప్పడు, ఆ తత్త్వజ్ఞానం యొక్క సార్థకత పరిమితమైపోతుంది. ఎన్నో జన్మల పుణ్యబల విశేషముచేత ఇనుపముక్క అయస్కాంతము చేత ఆకర్షింపబడువిధముగా సద్గురువుచేత ఆకర్షింపబడిన అదృష్టము మనకు కలిగిన తరువాత, సద్గురు బోధను త్రికరణశుద్ధిగా ఆచరిస్తూ, శ్రవణ, మనన, నిధిధ్యాసల ద్వారా స్వరూప ఎరుకలోకి మేల్కోవాలి. అట్టి సద్గురువులలో ఒకరైన ఆధునిక ఋషి "భగవాన్ శ్రీ రమణ మహర్షి" సమకాలీన మానవాళిలో ముముక్షత్వ స్ఫూర్తిని నింపి, మానవాళిని జాగృతులనుచేసి, అశాంతిని, అజ్ఞానాన్ని అతిక్రమించుటకు భగవాన్ చేసిన జ్ఞానబోధకు మనం ఎప్పడూ ఋణపడి ఉంటాం.

**- చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్, అమలాపురం**

# గురు అనుగ్రహం గురువు గుణం కాదు - గురు స్వరూపమే అనుగ్రహం

మన మనస్సు ప్రపంచ సంపదల మీద, ఇంటి మీద పిల్లలపైనా, స్నేహితులతోనూ నిండి ఉంటుంది. సద్గురువు ఆకర్షణ సాటిలేనిది. మనలోని ఆకర్షణల నుండి ఉపసంహరించి గురువు తన మీద నిలుపుకొనేలా చేసి అన్ని రకాల మురికి నుండి మనలను విముక్తి చేస్తాడు. గురువును ప్రేమించటం పరమాత్ముని మీద ప్రేమను మేల్కొల్పటానికి ముఖ్య సాధనము. గురువు పరమాత్మయే. మహాత్ముల సన్నిధిలో ఆధ్యాత్మిక ప్రవాహం వెల్లువై పారుతుంది. నిజమైన సత్యాన్వేషకులు దూరం నుంచి వచ్చి కూడా చేరుతారు. వారు ఎలాంటి వారైనా గురువు వల్ల వారు గుణాతీతులు అవుతారు. నిర్మలమైన మనస్సుతో వారిని ఆశ్రయిస్తే మనఃశాంతి, ఆత్మ తృప్తి పొందుతారు. సద్గురువు చాకలివంటివారు మనపాపాలనే మురికిని వదిలించి శుభ్రం చేస్తారు. గురు చూపుతో దొంగలు నీతివంతులుగా మారిపోతారు. శ్రీనాన్నగారు "నేను మీకు పెద్ద పాలేరుని. అజ్ఞానమనే ఈవల ఒడ్డునుంచి జ్ఞానమనే ఆవలిఒడ్డుకు మిమ్ములను చేర్చటమే నాపని. నిజ గురువును అనుగ్రహించమని వేడుకోనక్కర లేదు. అనుగ్రహం ఇయ్యటమే" అన్నారు. సద్గురువు రూపు దివ్యాత్మతత్వంతో కప్పబడి ఉంటుంది. వారి ప్రేమపాశంలో బంధించబడిన వ్యక్తి తాను కూడా అదే లక్షణాలతో కప్పబడి ఉంటాడు. కపట సాధకులు మహిమలను చూచి, ఆడంబరం చూచి, వాగ్ధాటిని చూచి, ప్రచారయంత్రాంగాన్ని చూచి భ్రమలోపడి బోల్తాపడతారు. గురువు సామాన్య మానవునకు అందుబాటులోనే ఉంటాడు. సద్గురువును మనంతటం మనం ఎన్నుకోవటం సాధ్యం కాదు. పరమాత్మ కృప కావాలి. ఆ గురువు దర్శనంతో మనస్సు ప్రశాంతతను పొందుతుంది. మన బాధలు మరుగున పడిపోతాయి. ఆయన "నా వాడు' అన్న ప్రేమ దానంతట అది ఉదయిస్తుంది. మనకు సరియైన ఆధ్యాత్మిక అర్హత వచ్చే వరకూ తనను తాను ప్రకటించుకోడు. మనం ఆర్తితో అన్వేషించటం మన కర్తవ్యం. అంతటితో మన బాధ్యత ఆయనే తీసుకొంటాడు అనుకొంటే పొరపాటు పడ్డట్లే. అది మొదటి మెట్టు. మనలో ఉన్న కోరికలు చెలరేగి వక్రమార్గంలోకి జారిపోవటం బహుతేలిక. తరువాత ఆయన పరీక్షలు పెట్టడం ప్రారంభిస్తాడు. కష్టాలలో పడిలేచేవారు కొందరు. గురు రూపం ధ్యానానికి ఆధారం, గురుపాదం పూజకు ఆధారం, గురు వాక్యం మంత్రానికి ఆధారం, గురు కృప మోక్షానికి ఆధారం, గురువే పరాగతి, పరావిద్యకు పరాకాష్ట. గురు పాదాలమీద దృష్టి నిలపకపోతే ఎంత అధికారం ఉన్న ఎంత సంపద ఉన్నా ఎంత పాండిత్యం ఉన్నా ప్రయోజనం ఒకటి లేని సున్నలతో సమానం.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్ధవరం